
REGD. No. M.4793. దీపావళి సంచిక 15th Oct. 1952

గృహలక్ష్మి



VOL. 21 **Grihalakshmi** NO. 10

Price As. 6.



సాలుచందా మొదలగునవి

ఈ సచిత్రమాసపత్రిక సాలుచందా రు 4-8-0. అర్థసంవత్సరపు చందా రు. 2-8-0. అంతకు తక్కువ కాలపరిమితి చందా పద్ధతి లేదు. విడికాపి ఆరు అణాలు. చందాదారులు ఏమాసమునుండియైన ప్రారంభము చేయవచ్చును. విడికాపీలు వలయువారు వాని విలువమేరకు తపాలాబిళ్లలు పంపవలయును. వీ. పీ. పద్ధతి వ్యయమూలకము. బర్మాకు రేట్లు ప్రత్యేకము.

ప్రకటనలు

ముఖ్యముగా స్త్రీలకందీయవలసిన వస్తువులనుగూర్చి ప్రకటించుటకీపత్రిక ఎంతయు అనువైనది. ప్రకటన చార్జీలు ప్రతిమాసము ముందుగానే చెల్లింపవలయును. కాలుపుటకు తక్కువయైన ప్రకటనలు చేకొనజాలము. రేట్లకొఱకు వ్రాయునది.

వ్యాసములు వ్రాయువారికి

వ్యాసముల ముఖ్యాశయము స్త్రీజనాభ్యుదయమైయుండవలెను. అవి సంగ్రహముగ నున్న శీఘ్ర ప్రచురణకు వీలగును. ఒకప్రక్క సిరాతో స్పష్టముగ తప్పులులేక వ్రాయవలెను. భాష గ్రాంధికముగాని, వ్యావహారికముగాని కావచ్చును; రెండును కలిపి వ్రాసిన అంగీకరింపబడవు. వ్యాసముల ప్రకటించుటలో సంపాదకులకు సర్వహక్కులు గలవు. ప్రకటింప నంగీకరింపబడినపుడు మాత్రము రచయితల కట్లు తెలుపబడును. విమర్శనార్థము పంపు గ్రంథములు రెండుప్రతులు పంపవలెను. రిప్లైకార్డు వ్రాసిననే బదులివ్వబడును.

సంచికలు చేరనిచో

సంచికలు చేరనిచో ఆయామాసములందు వెంటనే మాకు తెలుపవలయును. చిరునామామార్పును తెలుపకుండుటచే కాపీలు చేరనివారికి తిరుగ పంపజాలము. సంచికలు చేరనివారు తమతమ పోస్టాఫీసులలో కంప్లైంటును చేయునది.

చిరునామా మార్పు

చిరునామాయందు మార్పుఉండుచో ముందుగానే తెలుపవలయును. ఇట్లు తెలుపనిచో కాపీలు తిరుగ పంపజాలము.

ముఖ్యమైన గమనింపు

చందాదారులుగ చేర్చుకొనుమని వ్రాయు ఉత్తరములు, ఇతరమైన ఉత్తరములు మానేజరు, గృహలక్ష్మి, రాయపేట, మదరాసు అను చిరునామాకే వ్రాయవలయును. చెక్కులు, మనియార్డర్లు, పోస్టలు ఆర్డర్లు 'కేసరికుటీరం లిమిటెడ్' పేర పంపవలెను.

చెక్కులు మద్రాసు బ్యాంకులపైననే పంపవలెను.

గృహలక్ష్మి

స్త్రీల ఆరోగ్య సౌభాగ్యములను సంపాదించుట
కేర్పడిన సచిత్ర మాస పత్రిక

సంపాదకుడు

డాక్టరు. కే. యన్. కేసరి

సంపుటము ౨౧]   అక్టోబరు 1952   [సంచిక ౧౦

త్వరలో వస్తుంది!

విజ్ఞాన వినోదాలను
ఉత్తమ స్థాయిలో అందిస్తూ

శ్రీ రాజరాజేశ్వరి ఫిలిం కంపెనీ వారి

పెద్దరికాలు

అంజలీదేవి, కన్నాంబ
లింగమూర్తి, రేలంగి..

కె.బి.నాగభూషణం





ఛత్రియా రిలీజ్...



డైరెక్షన్... ప్రభాకర రావు

విషయసూచిక





మ హో ప దే శ ం



జయజయ గృహలక్ష్మి సఖి! జయజయ లలితాంధ్ర! మధుర సారస్వతిమా!
జయజయ లలనా రత్నమ! జయజయ విద్యాప్రబోధ! జయకల్యాణీ!

దీపావళి

మేము యీ సంవత్సరము దసరాకు సరిగ్గా అందించలేని మా ప్రత్యేక సంచికను దీపావళికి అందించకలుగుటచే దీనిని దీపావళి సంచిక అని పిలుస్తున్నాము.

దీపావళి మహా పర్వదినం. నరకాసురుడికి శ్రీ కృష్ణునకు జరిగిన యుద్ధంలో సత్యభామ సహాయంతో నరకాసురుడు వధించబడి ప్రజల ఆనందోత్సాహములకు కారణమయినరోజు. అంతేకాదు ప్రతి స్త్రీ కూడ తాను అబలనుకాదు–శక్తి స్వరూపిణినని సగర్వంతో చాటుకోవలసిన రోజు. పురుషుడైనా స్త్రీ సహకారంతోటే మహాత్కార్యాలను సాధించ కలుగుతాడని గుర్తించుకోవలసిన రోజు.

ఈ రోజున అభ్యంగన స్నానాలు, నూతన వస్త్రాలంకరణ, పంచభక్ష్య పరమాన్నములు, కొన్ని ప్రాంత్యాలలో లక్ష్మీ పూజలు ప్రత్యేకత.

ప్రతి గృహము సుందరముగా నలంకరించబడి బంధుమిత్ర పరివారంతో కళకళలాడుతుంటుంది. పసిపాపల మొదలు ముదుసలులవరకు ఉత్సాహ పరంపరలకు మేర యుండదు. ఈ పండుగకు భాణాసంచా పెట్టింది పేరు.

ఈ సంతోష సమయంలో మా పాఠకులను హృదయ పూర్వకంగా నభినందిస్తున్నాము.

సంఘ నిర్మాణం



ఈ మధ్య శ్రీ సి. రాజగోపాలాచారిగారు ప్రసంగిస్తూ కులతత్వాలు నశింపుకావడానికి అంతర్వర్ణ వివాహాలు మంచి మార్గమన్నారు.

గార్హ్యశాస్త్రవేత్తల సమావేశంలో వక్కాణిస్తూ "యువజనులు వివాహితులై నిర్దిష్టమైన దాంపత్య జీవితమును గడుపుతూ తమ గృహాలను ఆనందదాయకములుగా మార్చుకోడానికి సహాయభూతంకాగలదే గార్హ్యశాస్త్ర"మని వివరించారు.

పై రెండు విషయాలు చాల ప్రధానమయినవే. వీనిని గురించి పెద్దలు అనేకసార్లు మహోపన్యాసాలిస్తుంటారు. అమలుజరుపడమనేసరికి నిర్మాణాత్మకమయిన కృషి అత్యల్పం.

కులతత్వాలు నశించాల్సిందే. కాని అంతర్వర్ణ వివాహాలను చేసికోవలసిందిగా ప్రబోధించినంత మాత్రాన సులభంగా జరిగేవి కావు. కులతత్వ విభేదాలకు ప్రాతిపదిక ఆర్థిక, విద్యా విజ్ఞాన రంగాలలో సమానత్వము వివిధకులాలమధ్య ఏర్పడినప్పుడుగాని కులతత్వ భేధాలు నశించవు. ఇది సమకూరనన్నినాళ్లు అంతర్వర్ణ వివాహాలు కూడ తృప్తికరమైన ఫలితాల నీయజాలవు.

కులాలమధ్య సమానత్వాన్ని సాధించడానికి మార్గాలున్నవి. వివిధవృత్తులను బట్టి కులాలు ఏర్పడినవని చరిత్ర. కాని యీనాడు ఆయాకులమువారు వారి వారి వృత్తులనే అవలంబిస్తున్నారనడానికి అవకాశంలేదు. కాని సంఘానికి ప్రతివృత్తీ అవసరమే. అటువంటప్పుడు అన్నివృత్తులను సమానగౌరవముతో చూస్తే వివిధకులాల మధ్య సద్భావము పెంపొందుతుంది.

ఇక అన్ని కులాలకు విద్యా సౌకర్యాలు సమకూరితే విజ్ఞాన వికాసాలు పెంపొందుతవి. దానితోటి అందరు కలసిమెలసి తమ జీవిత పురోభివృద్ధికి పాటుపడతారు. పరస్పర సహకారంతో తమ ఆర్థిక, సాంఘికపురోభివృద్ధికి కృషి చేయడాని కానాడు వివిధ కులాలవారికి అవకాశముంటుంది. ఆనాడు అంతర్వర్ణ వివాహాలు, వానిననుసరించి వివిధకులాల మధ్య సన్నిహిత సంబంధ బాంధవ్యాలు సమకూరి కులతత్వ భేదాలు నామరూపాలు లేకుండా పోతవి. ఆ నాడే శుభదినం.

ఇక సాంఘిక జీవితంలో ప్రధానమయింది గృహస్థాశ్రమం. దానికి సంబంధించింది గార్హ్యశాస్త్రం. ఆశాస్త్రం ఒక యువకునకు మాత్రం సంబంధించినది కాదు,

యువతీ యువకులిరువురు తమ గృహపరిస్థితుల నర్థముచేసికొని, ఉన్నంతలో నిర్దిష్టమైన దాంపత్య జీవితమును గడుపుతూ తమ గృహాలను ఆనంద దాయకములుగ మార్చుకోడానికి సహాయభూతం కావలసినది.

ఈ సందర్భంలో స్త్రీలు, పురుషులుకూడ తెలిసికోవలసిన విషయాలు చాల ఉన్నవి.

విద్య పురుషులతో బాటు స్త్రీకి అవసరమే. కాని తమ గృహాలను ఆనంద దాయకములుగా మార్చుకోడానికి తగినవిద్య స్త్రీకి అవసరం. తన కుటుంబ క్షేమాన్ని, ఆనందాన్ని సమకూర్చగల విజ్ఞానాన్ని ప్రసాదించగల విద్య స్త్రీలు అభ్యసించాలి. గృహానికి సంబంధించిన ఆర్థిక శాస్త్రం, భర్తను, పిల్లలను ఎలా సుఖపెట్టవలసింది, గృహాలంకరణ, ఆరోగ్యమైన, రుచియైన ఆహారాన్ని సమకూర్చి తయారుచేయడం, ప్రేమతో మెలగడం, ఓర్పు, సహనం అలవరచుకొనడం, ఎల్లప్పుడు మృదువుగా మాట్లాడడం మొదలైనవన్ని గృహిణిగా స్త్రీ నేర్చుకోవలసినవి గార్హ్య శాస్త్రంలోని విషయాలు.

దాంపత్య జీవితం యిష్టంలేక ఉద్యోగాలు చేయాలనుకొనేవారి విద్య దానికను వైనదిగా నుండవచ్చును.

పురుషుడు సంపాదించి తెచ్చినను దానిని జాగ్రతగావాడి కుటుంబాన్ని స్వయం సమృద్ధిగా చూడవలసినది, గృహాన్ని నరకతుల్యం కాకుండా చూడవలసినది గృహిణి. ఇట్టి దానిని నేర్పగలవిద్య ఏనాడు అమలులోనికి వస్తుందోమరి!

ఇక పురుషులు సయితము తమ ఆర్థికస్థితిని గుర్తించి కుటుంబ వ్యవహారాలలో భార్యలకు సహకరిస్తుండాలి.

భార్యాభర్తలిరువురు తమ హక్కులను గుర్తించి మాట్లాడే ముందు బాధ్యతలను గుర్తిస్తే దాంపత్య జీవితము సుఖప్రదంగా నుంటుంది. గార్హ్య శాస్త్రము యిందుకు ఎంతైనా ఉపకరిస్తుంది.

సంఘ నిర్మాణం విషయంలో ప్రభుత్వము, ప్రజలుకూడ పైవిషయాలను గుర్తించి అవసరమగు ప్రణాళికలను తయారుచేసి అమలుపరతురుగాక!

'సిసి'

రాజర్షి డాక్టరు. కె. యస్. కేసరిగారి ఆశ్రమనివాసం.

గత ఆగష్టు 19వ తేది మధ్యాహ్నము 4 గంటలకు అకస్మాత్తుగా [వారి పరివారముతో సహా] మా విద్యాలయమునకు వచ్చిరి. వారి రాకను గాంచి ఆశ్చర్యానందములతో మునిగి పోయితిని. వెంటనే కొంచెము వారు అనారోగ్యముగా యున్నటుల గుర్తించితిని. కొలది కాలము సంభాషణానంతరము విద్యాలయము నందుగల రెండు వేపచెట్లను వాటి సమీపమునందే నిర్మింపబడియున్న పర్ణకుటీరమును గాంచి, “అమ్మా! ఈ కుటీరమునందే నేను కొంతకాలము విశ్రాంతి గైకొనవలయును. నేను పుట్టినచోటు నాకిప్పుడు జ్ఞాపకమునకు వచ్చుచున్నది. పట్టణవాసమునందుగల నా సౌధాంతర జీవితము ఎంతమాత్రము నాకు సుఖమొసంగుట లేదు. కనుక నాకు ఈ కుటీరవాసమే



సౌఖ్యమొసంగునను నాశతో కోరుచున్నా” ననిరి. తోడనే మా రెండవ సంతసమొందితిని. ఇట్టి నిరాడంబర చిహ్నలు ఈ రాజ్యము నందింకను గలరాయని ఆలోచించసాగితిని. (శ్రీ). కేసరిగారు నిజముగా వారి చిన్నప్పటి మన సెటులు వారి యువులు, పల్లెటూళ్ళ జీవితములు వారి హృదయ ఫలకమునందు అచ్చు గ్రుద్దినట్లుగా యింకను నిలచియున్నవి. వారెంత సిరిసంపదలతో తులదూగినను, చివరకు ఆసిరిసంపదలంతయు దేహాలంపటులేగాని ఆత్మకు శాంతి నొసగు నటువంటివిగావని ప్రత్యక్షముగా గుర్తించిరి.

తాంబ్రం నిజముగ ఆరోగ్యమునకు నిలయమైనది. త్రికాలములయందు తగినటు వంటి సౌఖ్యము పర్వతప్రదేశము లివ్వగలదు. సుందరముగ, గంభీరముగ, చుట్టూ కొండలు చెరువులతోను, పచ్చనిపైరులతోను నిండియుండి చూచుటకు కనుల పండువై యుండును. తాంబ్రమందుగల భావులలో నీరు శుద్ధోదకము. మా విద్యాలయ సమీపమున నొకకొలను గలదు. ఆ కొలను గట్టున చోళరాజ్య, పాండ్యరాజులనాటిది పార్థివలింగ మనుపేరుతో నొక పెద్ద శివలింగముగలదు. దానికి సమీపమున శ్రీ ఉడిపి విజయేంద్రస్వామియను నొక యతీశ్వరులుగలరు. వారు గోసంరక్షణకని నొక ఆశ్రమము నడుపుచున్నారు. వారు జ్యోతిషశాస్త్రమునందు పండితులు. శ్రీ కేసరిగారు స్వామి దర్శనమునకై వచ్చుచు పోవుచున్నట్లు వారు చెప్పిరి. శ్రీ కేసరిగారి ఆరోగ్యము దిన దిన ప్రవర్ధమానమై యుండుటకై సదాసర్వేశ్వరుని ప్రార్థించుచున్నాము.

మద్రాసు నందుగల తెలుగువారి అభివృద్ధికొరకు లక్ష లక్షలు విరాళముల నొసంగి నటువంటి దానకర్తలు. స్త్రీలయెడ నిండు అభిమానముతో మాతృ ఆరాధన పూర్వకముగ ఏటేట స్వర్ణకంకణములను బహుకరించుచూ స్త్రీల ఉద్ధరణకొరకు అనేక సంవత్సరములుగా "గృహలక్ష్మి" అను మాసపత్రికను ప్రచురించుచూ, తద్వారా తమ అంతులేని స్త్రీ సంఘాభిమానమును ఋజువు పరచినవారైరి.

1922 లో తిరువళిక్కేణి 1/10 అళంగాతపిళ్ళైవీధియందు ఒక చిన్న గృహము నందు మా సంస్థ, "హిందూయువతీ శరణాలయము"ను, "హిందూయువతి" అనెడి పక్షపత్రికయు సంఘ సంస్కరణకై నెలకొల్పబడియుండెను. అటువంటి సమయమున, శ్రీ కేసరిగారు స్వయముగా మా శరణాలయమును సందర్శించి మమ్ములను వెంటనే ఒక విశాల భవనము, మూడు ఎకరముల తోటగల నెం॥ 2. మంటపంరోడ్డు, కీల్‌పాక్‌లోని ప్రదేశమునకు మార్పించిరి. కొలదికాలము మా సంస్థకు కోశాధిపతిగా నుండుటయేగాక, ఆశ్రమ బాలికలచేత, నిత్యజీవితమునకు ఉపయుక్తములగు కొన్ని కుటీరపరిశ్రమలను చేయించిరి. ఖాదీశాఖకు సైతము నూతన మగ్గములు, రాట్నములు ఒసంగిరి.

మరల నేటికి భగవంతుడు పంపిన ప్రతినిధివలె విద్యాలయపునరుద్ధరణ కొరకు కృషిచేయు తరుణమున ఈ మహాశయులు అరుదెంచుట ఎంతయు విద్యాలయముయొక్క మహాభాగ్యమనియే చెప్పవలయును.

నా ఏకైక పుత్రిక, శ్రీ కనక దుర్గాదేవి, ఈ విద్యాలయ సేవకు హృదయపూర్వకముగా, కంకణబద్ధురాలగుట ఎంతయు సంతసింపవలసియున్నది. ఈమె 6 సంవత్సరముల బాలికగా నున్నప్పటినుండియు విద్యాభిలాషిణియై, అపజయమనునది ఎఱుంగక పరీక్షలందు ఉత్తీర్ణురాలైనది. 1944 సంవత్సరమున ఆంధ్రమునందుగల క్రైస్తవ కళాశాలయందు ఎం. ఎ. పట్టభద్రురాలైనది. గతరెండు సంవత్సరములలోగా బి. టి. ఎం. ఇడి. పరీక్షలందు కడతేరి, ఈ విద్యాలయ నిర్వహణకు పూనుకొనియున్నది. ఈమె ఇప్పుడు ఇద్దరి బిడ్డల తల్లియైనందువలన, తన మాతృభావానుభవము కూడా ఈ విద్యాలయ సేవకు బహుభంగుల ప్రయోజనకరమగునని నా విశ్వాసము. ఇట్టి తరుణమున మహానుభవమును సంపాదించినవారును, ఫలభరిత మనస్కులును, వయోవృద్ధులును అంతులేని తరుణ కర్మయోగులును యైనటువంటి డాక్టరు. శ్రీ కె. యన్. కేసరిగారియొక్క ప్రేమ పూర్వకమైనటువంటి సహాయ సలహాలతోను వారి అనుభవ పూర్వకమైనటువంటి క్రమశిక్షణతోను, నా కొమరితయైన శ్రీ కనక దుర్గాదేవి, ఈ భారత కన్యా విద్యాలయమునకు నిర్వాహకురాలుగాయుండి, ఈ సత్ కార్యమును భక్తి జ్ఞాన, వైరాగ్య సంపదలతో నిర్వర్తించగలదని నమ్ముచున్నాము. ఇందుకు ప్రజలు సయితము సహకరించి సహాయపడెదరని నమ్ముచున్నాము.

మహాపురుషులైన శ్రీ డాక్టరు. కె. యన్. కేసరిగారు మా విద్యాలయ కుటీరమున విశ్రాంతి గైకొనుచున్నారు. వారికి క్రమంగా కొంచము స్వస్థత కలుగుచున్నది. ఇచ్చట ఇంకా కొన్ని రోజులు విశ్రాంతి గైకొనెదనని శెలవిచ్చిరి. వారికి విశ్రాంతి నొసంగుటకు ఉడతా భక్తిగా ఈ విద్యాలయమునకు అవకాశము గల్పించిన భగవంతునికి మిక్కిలి కృతజ్ఞులము.

యన్. యామినీపూర్ణతిలకమ్మ

-

స్త్రీ మనస్సు 

 చిదంబర రహస్యమా?

పురుషుడు విశేషజ్ఞాన సముపార్జనచే, శాస్త్రసహాయముతో సృష్టిరహస్యములన్నీ మెల్లగా తెలిసికొనుచు తన సుఖమును అనేక విధముల పెంపొందింపచేసుకొనుచున్నాడు. కాలమును, మేఘములని, గాలిని, నీటిని వెయ్యేల ప్రకృతినే ధిక్కరించగల శక్తిని సంపాదించినాడు.

కాని సృష్టికి మూలమై, తనకు నిత్యము చేదోడు వాదోడుగానుండు స్త్రీని అవగాహన చేసుకొనజాలక పోయినాడు. దేశముల అంతుబట్టవచ్చు (discoverers) నూత్నయంత్రములను నిపెట్టవచ్చు, ఖార్ఖానాలు నిర్మింపవచ్చు కాని స్త్రీ మనస్సును పురుషుడు పూర్తిగా గ్రహింపజాలకున్నాడు. స్త్రీ మనస్సులో తయారగు భావములు పసికట్టజాలకున్నాడు. ఆ భావముల ఆది అంతములను అంతుబట్టలేక దిగాలుబడుచున్నాడు.

కారణము - స్త్రీ మనస్సు - ఊహాతీతమా? కాదు అది ఒక సూక్ష్మయంత్రము. ఈ సూక్ష్మయంత్రమును తెలిసికొనగోరు వ్యక్తికి అంతులేని శాంతి, అపారమైన పట్టుదల, అఘాతమైన ఓర్పు కావలయును. ఇట్టి శాంతి, ఓర్పు, పట్టుదలతో స్త్రీ మనస్సు తెలిసికొనుటకు ప్రయత్నము చేయకయే

"క్షణక్షణముల్ జవరాండ్ర చిత్తముల్"
"స్త్రీహృదయము దెల్ప బ్రహ్మదేవునివశమే"
"అతివలజూచి వీరబలలంచు వచించు
మహాకవీంద్రులుద్ధతి విపరీతవాదులు"

అని పరిపరి విధముల దూరుదురు.

ఇట్లు పురుషులు స్త్రీల మనస్సు తెలిసికొనలేక తికమకబడుట వింతగాదు. ఆమె మనస్సు భేదించుట దుర్లభమగుట సహజము. ఇదే చిదంబర రహస్యము.

ఒక చిన్న ఉదాహరణ. అనుదినము నిత్యజీవితములో జరిగే వ్యవహారమొకటి తీసికొందము.

భర్త భార్యను తనతోపాటు షికారునకు రమ్మని పిలుచును. ఆ రోజు సరేనని భార్య చక్కగా శృంగారించుకొని హుందావిడిగా భర్తతో బయలుదేరి ఉల్లాసముగా మాట్లాడుతూ కాలము గడపును.

ఇంకోరోజు భర్త ఎంతో అనునయముగానే గృహిణిని 'వస్తావా షికారు'కని కేకవేయును. పట్టుకాజాలలో గుండీలు పెట్టుకొనుచూ ఈ వేళ ఎక్కడికి వెళ్ళితే బాగుంటుందని ఆలోచించుకొంటూ వుండవచ్చు - కాని అవతలనుండి "మీకేమి పనీపాటూ లేదు. మీతోపాటు తిరగటానికి నాకు ఓపికలేదు, తీరికాలేదు. నేను రానుపొ"మ్మని చండికారాణి వైఖరిలో చెప్పుతుంది.

అప్పుడీపురుషసింహుడు ఏపాటి వివేకము, స్త్రీ మనస్సు అర్థము చేసుకున్న వ్యక్తయినా 'సరే ఈ వేళ వద్దులే' అని కాలుగాలిన పిల్లివలె సర్దుకుంటాడు. కాని అహంభావముతో 'నీవెప్పుడూ ఇంతేగా' అనో 'నా ఖర్మ' అనో ఏదో అప్రస్తుతపుమాట జారవిడిచాడా ఆ వేళ టపాకాయలు పేలవలసిందే. ఏటంబాంబు పేలకుండావుంటే సంతోషింపవచ్చు.

కారణము? - ? - ? క్షణక్షణముల్ జవరాండ్ర చిత్తములా? బలహీనురాలుగావున రోజూ షికారుకు రమ్మనమనిన తిరుగలేక 'రానుపొ'మ్మని నదా?

స్త్రీల చిత్తములు క్షణక్షణము మారుచుండవచ్చును. కాని ఆ మాటలలోను హామ్లెట్ పిచ్చివలే ఒక పద్ధతివుంది. ఈ చిదంబర రహస్యములోని అసలు రహస్యమేమి?

స్త్రీకి ఒక ముప్పది రోజుల కాలములో ఒక రోజువున్న పరిస్థితి ఇంకో రోజు వుండదు. కారణము ఆమెలోని వినాళ గ్రంధులు లేక అంతస్స్రవణ గ్రంధులు (Endocrine glands) ఈ నెల రోజులలోను అనేక విధములగా మార్పుచెందుతూ శరీర తత్వమందు మార్పులు కలిగించును. శరీరతత్వముతోపాటు మానసిక తత్వమును మారును. అట్లే నిత్యమూ శరీర తత్వము మానసిక తత్వము జంటగా మారుచుండును. కావున వారి ప్రవర్తనలో నిలకడ గానబడదు. అందుచే తండ్రులు, భర్తలు, పుత్రులు సమయాసమయములు గుర్తించి ప్రవర్తించిరేని సాధారణముగా గృహములందు ప్రేలు టపాకాయలను పూర్తిగా ఆర్పివేయగలరు.

సర్వసాధారణముగా స్త్రీలు బలహీనులనుట వాడుక. కాని ఒక విధముగా జూచిన స్త్రీలే పురుషులకన్న బలముగలవారని ఒప్పుకొనక తప్పదు. స్త్రీలే పురుషులకన్న ఎక్కువ సంవత్సరములు బ్రతుకుదురు. భార్యలులేని భర్తలుకన్నా ప్రపంచమంతటా భర్తలులేని భార్యల సంఖ్య ఎక్కువ. ఏవైనా పెద్ద జబ్బులు వచ్చినప్పుడు వాటిని స్త్రీలే ధైర్యముతో తట్టుకొనగలరు. పురుషులే సాధారణముగా వాటికి బలిఅవుదురు. వైద్యుడు తన సంపాదనకు పురుషులమీద ఆధారపడియుండజాలడు. స్త్రీలే వారి దాతలు. స్త్రీలు మాతృభారము వహించుట నైజము. ప్రసూతి వగైరాలవలన వారికి పలువిధములైన జబ్బులు చేయుటయూ సహజమే. మగవారితోపాటు పరిగెత్తుట, పనిచేయుట, బరువుల నెత్తుట చేయలేకపోవచ్చునుగాని వారే రోగములనైన జయించి దీర్ఘ కాలము జీవింతురు,

అయితే, మానసికముగా స్త్రీలు దుర్బలులా? హిస్టీరియా మొదలగునవి స్త్రీలకే తరచుగా వచ్చుటకు కారణమేమి? స్త్రీలు మానసికముగా దుర్బలురకారు, ఏదైన విషయమున ఎక్కువగా మానసికముగా అందోళనబడుట సహజలక్షణము. ప్రతిది వ్యక్తిగతముగా ఆలోచించుకొనుటయే వారి ఆరాటమునకు కారణము. కావున స్త్రీలకే ఎక్కువగా హిస్టీరియా వచ్చుటకు అవకాశమున్నది. కాని పురుషులకు పైకారణమువలననే జీర్ణకోశమందు పుండ్లు (ulcers) ఎక్కువగా వచ్చును. ఆత్మహత్యలు వారిలోనే ఎక్కువగా వుండును.

శాస్త్రవేత్తలు రచయితలు Winifred Johnson, Lewis Ternan of Stanford University, న్యూయార్కువాసి 'Dr. Judson May Gladis స్త్రీలు చపలచిత్తులా అన్న విషయము చర్చించి, పరిశోధించి, తేల్చి వారు బలహీనులు కారనియు, వినాళ గ్రంధులు లేక అంతస్స్రవణ గ్రంధుల (endocrine glands) వల్ల అకాల ఉద్రేకములు కలుగుచుండుననియు, తత్కారణముగా పురుషులు స్త్రీలను సమయము గుర్తించి అనుగుణంగా ప్రవర్తించవలయునని సలహానిచ్చియున్నారు.

కె. లక్ష్మీ రఘురామ్

ఎవరామె — ప్రేమా!!

మూలం:
శ్రీమతి దినేశనందిని దాల్మియా

స్వేచ్ఛానువాదం:
శ్రీపాద

తోటమాలీ!... ఓమాలీ!!
మధుపము చుంబించిన
విరిసి విరియని ఆ
సుమముల గోయకు;
హిమకణముల బరువెక్కిన
లేబచ్చిక నాసజ్జాలో నుంచకు;
ఆఘ్రాణించిన ఈదళముల
నాస్వామి యెన్నడాసింపడు;...
వెచ్చని రుధిరంతో నిండిన
మచ్చలేని నాహృదయం
అర్పించి...హరించిపోతా కర్పూరంలా!

ఒక్కటొకటిగ
రెక్కలన్ని పరుగెత్తినా
ప్రొద్దన్నది పొడువలేదు;
వార్ధక్యపు అంధగృహములో
అల్లాడె జీవునిమీదుగ, పయనించె
అగమ్య గోచరమగు
యౌవనచ్ఛాయలు,
మృత్యుదేవి పయ్యెద మాటులో
సుఖసుషుప్తి నొందాయేమో!
అద్యతభావిలోని
విద్యుత్ రేఖలు
గతించినస్వప్న జగత్తును
మతిగలిగిన వారికిచూపిస్తున్నాయి;
మినుకుమినుకుమంటు
'దీపం' తనమొగమును ముడుచుకొన్న,
చుక్కలన్ని ఆకాశంలో
పక్కదారి పడిపోయిన,
అంతు అంటు కనిపించదు
అంధతమస్సుతోనిండిన ఈరేయికి!!

వ్యథతోగూడిన ఈ
శూన్యజీవితములో
'నిన్నంటు' నేకనుగొంటె:
బాలభానుని గొలుసులతో బంధించి
దాచేస్తా నాచీరచాటున;
అసన్నిహితపుబాధా
వహ్నంతా నే మఱచేదాక
జగత్కన్యక కన్నులమూసేస్తా;
క్షుద్బాధాపీడిత మృత్యుదేవికి
అందరాని ఆకాశం ఆవల
మదీయ కవోష్ణ హృదయ
రుధిరధారల తర్పణమిచ్చి
లాలించి, పాలిస్తా; ... ...
నావానిగ 'నీ' వొక క్షణమైతె:
సృష్టికర్త వక్రమార్గముల
తిరిగిపట్టిస్తా!
నాకై 'నేనే' ఓ ప్రశ్నార్థకమౌతా!!

"త్రిభువనములు నిత్యం
స్మరించె నీయందమును;
పవిత్రమైనమనపూర్వస్మృతులను;

అంతులేని నా అగాధప్రేమను;
నందనవనపరిసరముల
అందముగ ప్రవహించెడి
దేవగంగ కౌగిలిలో
నీలపుపద్మజదళముల నిలచిన నిన్ను;
ఆపైనే తెంచే సుగంధ మారుతముల
చలించి, ద్రవించిన ఛాయల
జీల్చుకొంటు బహిర్గత
మొందిన రేఖాజ్యోతిని;"
లోకం తనస్మృతిపథం నుండి
క్రిందకుత్రోసేస్తుందా ??

వికసితసంధ్యాసమయంలో
వినువీధినితాకె కొండకోనల
విరజిమ్మెడి అరుణకిరణములు
క్రమక్రమముగ క్షీణించగ;
దినమంతా తటాకపుటలలలో
కనలిన పరిమళ నీరజదళము
లొక్కుమ్మడి కన్నులమూయగ;
ఇంద్రధనస్సురంగుల
మరపించుచు నాట్యంచేసె
మయూరపింఛము
లేతాకులమాటున విశ్రమింప;
మెల మెల్లగ దయ సేయుముస్వామి!
విశ్రమించునా వక్షస్థలి
మరచిపొమ్మజీవిత
బాధాగాథల; శాంతిగొనుము
బంగరు సూర్యుండుదయించెవరకు.

స్వామీ! ప్రేమించుము నన్ను
లేదా, వేధించుము నిరతము.

నిన్నుపూజించుటె: నాయాచారము;
కవిగానముగ నిను
నుతించుటె: నాయాశయం;
నీసౌందర్యమె: నా 'శివాలయం' లో
వెలిగించిన నూత్నజ్యోతి;
నీదాస్యమె: నా అదృష్టానికి
శాశ్వత కౌలుపత్రం;
నీయడుగులలో పయనించుట;
కాశీ, బృందావన, రామేశ్వర
మక్కా, మదీనాల సందర్శించుట;
నిత్యం ప్రవహించె, స్వచ్ఛమైన
నాహృదయ స్రవంతుల
నీపుష్పోద్యానముల
నార్ద్రిమ్మొనర్చుటె: నావాంఛితం;
మందస్మిత వదనంతో
నీప్రేమోలను మరణించుటె:
నాభక్త్యుత్సాహములకు నిదర్శనం;
స్వామీ! ప్రేమించుమునన్ను
లేదా వేధించుము నిరతము.

నీపరోక్షంలో సముద్రంలా
నాహృదయంబెట్లాఘోషిస్తుందో...??
తైలం లేకున్నను బుడ్డీలన్ని
శూన్యంలో వెలుగుచున్న;
కాష్టవహ్ని లేకుండనె
లోకాన్నంతదహించు ఆవేదన;
భగభగమండె మరణజ్వాలలు
వానజల్లులేకున్నను
గగనంలో కనుమూస్తున్నాయి;
పదార్థములేకున్నను

సాగిపోతున్నాయి, ప్రకృతి
కాంత సుందరమృదు పదయుగళం;
సూత్రప్రాయముగ మృత్యుమూర్తి
కార్యక్రమం ముగుస్తూంది; ...
కాని-కనుపింపదు ...
తెర ఆవలిసూత్రదారి.
అయినప్పటికి ఆడుతూంది
నాగుండెలాన్నో గడియారం
నీపరోక్షంలో !

'నిదురించెడి ఈజగతిని
రక్షించె ఓదశదిగ్గజముల్లారా !
మధురమైన ఈ 'పూకౌగిలి' ని
గూడ కాపాడండి:
శ్రమించినస్వామి నాకై యందు
కలవరించుచు విశ్రమిస్తున్నాడ' ని
గద్గదకంఠంతో
ప్రార్థించిందో కాకన్నియ !

కాని .... కాని ....
రాకుమారి 'గోరీ' అది ఇప్పుడు:
సుమలతా వితానములు
కప్పేసాయాభూస్థలినంతా,
పరిమళద్రవ్యాలను
గొంపోతుందా మీదుగ ఓపిల్లగాలి;
వెన్నెలతీవల కన్నె మనసుల
కదలించె నిండు చంద్రుడు,
వెదజల్లిన మల్లెమాలతులు లా
వికసించిన తారాగణములు, :
వియత్ మార్గమున
వెలిగిస్తున్నారెన్నో విద్యుత్ జ్యోతుల;
విలపించెనిశాదేవి
కనుపాపల కదలిరాలు
హిమకణములె గోరీపై
చిలికెడి పన్నీరు ....
'ఎవరామె ... ప్రేమ?'
యని ప్రశ్నిస్తుందీ
పురోగామి ప్రపంచం
కొన్నిశతాబ్దాలనంతరం !
గతించిన జీవితాల
జ్ఞప్తిజేయునిశ్చల
సౌందర్యోపాసన,
స్వతంత్రమానవత్వం,
అంతులేని యౌవన మదం,
మసక మసక వార్ధక్యం,
అన్నీ ఒక్కుమ్మడి
తెరపైబొమ్మలులా
గిరగిర తిరిగి
అంతర్ధానమగుతున్నాయి.
కాని ...
సువాసనలీనె ప్రేమతావులు,
జగత్ విచ్ఛిన్నమైనను
నిలచినదివ్యత్వం
తీయనిరాగాన్నాలాపిస్తు
ఇంకా అలా అలా విహరిస్తుంటాయి? ...
'ఎవరామె...ప్రేమా?'
యనిప్రశ్నిస్తుందీ
పురోగామి ప్రపంచం
కొన్నిశతాబ్దాలనంతరం !!

"హవాల్దార్ కథ"

శ్రీమతి తు. సీతాదేవి

(గత సంచిక తరువాయి)

అంబవ్వ వంట యింట్లోకివెళ్ళి మంచి నీరు ఒక పెద్ద యిత్తడి బిందెలోవి కప్పుతో తీసింది. ఆమె చేతులు భయముచే వణకుచుండెను. ఆమె ఆతొందరలో అనుమానముతో బహుశః బిందెమీద మూత సరిగా వేయలేదు కాబోలును, దండప్ప కప్పుతో నీరు త్రాగునప్పుడు, ఆ యిత్తడి బిందెమీద మూత క్రిందపడి శబ్దము అయినది. వంటింటిలో నిద్ర పోతున్న ఆ చిన్నవాడు భయముతో వులికిపడి లేచెను. మనిషిలేచిన ధ్వని దండప్ప చెవినిబడెను. అనుమానముతో భార్యను అడిగెను. "ఏమిటది?" ఏమి ఒక మాటకూడా బదులు చెప్పకుండానే అంబవ్వ మరల దారికడ్డముగా వెళ్ళి నుంచుంది. దండప్పకు అప్పుడు ఎవరో లోపల దాగివున్నట్లు అనుమానము గట్టిగా తట్టినది. మంచముదిగి ఆమె పైకి ఒక పరుగునవెళ్ళి అడిగెను. "నీకు ఎవరు అంత ఆప్తులున్నా ప్రాణ స్నేహితులు అక్కడ?" అంబవ్వ అప్పుడు తనకులేని ధైర్య సాహసములు తెచ్చుకుని తన శక్తినంతను వుపయోగించి చెప్పిందో చాలా కష్టము. ఆమె "ప్రాణస్నేహితుడు కాడు, కొడుకు," అంది. ఎవరికి తెలియదు ఆమెకు ఆ సమయమున ఆ సాహసము ఎట్లు వచ్చినదో, అయితే దండప్పకి ఎదురుగా ముఖముపెట్టి దారి కడ్డముగా నిలబడెను. దండప్ప కోపముచే మండిపడుచుండెను. "కొడుకు! నీ కొడుకు ఎప్పుడో చనిపోయినాడు. వీ డెవడు? దారి విడువుము" అని గట్టిగా అరిచెను. అయినప్పటికి ఆమె అను మాత్రము అక్కడనుంచి కదలలేదు. దండప్ప ఆమె చేతులు పట్టుకుని గట్టిగా తగవులాడుతున్నాడు లోపలికి వెళ్లుటకు.

యీ పాటికి యీ చిన్నవాడు లేచినాడు. తను చాలా అపాయములో వున్నాను అని గ్రహించి వాడు తప్పించుకుని పోవుటకు కిటికీ ఎక్కి యినుప కడ్డీలు బలవంతముగా విరిచి పోవుటకు ప్రయత్నము చేయుచుండెను. అది దండప్ప చూచిన వెంటనే వీడే తన మనిషి అని తెలుసుకున్నాడు. వాడు పైకి గట్టిగా వళ్లు తెలియక కేకలు వేసినాడు.

"హంతకుడు కాడు, వాడు ఎప్పుడూ చేయి యెత్తి ఎవరిని చంపలేదు," అంది అంబవ్వ.

"నీ కొడుకును చంపినవాడే" అన్నాడు దండప్ప. ఆమె యిది వినగానే ఆమె చేతులు వణక నారంభించెను. అయితే వెంటనే ధైర్యము తెచ్చుకుని త్రిప్పుకుంది. "వాడు చంపినది నా కొడుకు అని కాదు, ఆ తొందరలో ఆ సమయమందు అటిసితిలో అనవసరమైన పనులు అనేకమైనవి జరిగినవి" అంది అంబవ్వ. "ఔను! చూడగా నీకు యింతలో అంత వైరాగ్యము అంత ధైర్యము సంపాదించావు ప్రక్కకునుంచో. ఈ మనిషిని తప్పక వురిసంభమునకు తీసుకుపోవాలి, ఎందుకుకాదు వీడే నా కొడుకుని చంపుటకు కారణం."

"యీ చిన్నవాని తలకొట్టినంత మాత్రమున అది మన కుమారుని వెనుకకు తీసుకు వస్తుందా?"

"నాపని, నాపించెను, ఆ బహుమానము?"

"యీ చిన్నవాని ప్రాణములు చంపి తెచ్చే బహుమానము ఎంత గొప్పదైనాసరే, అది ఏదీ మనము తీసికోవద్దు."

"చూడు! వాడు మరల తప్పించుకుని పోవుటకు ప్రయత్నము చేయుచున్నాడు. నన్ను లోపలికి వెళ్లనిమ్ము. యిదిగో నీకే నేను చెప్పుతున్నాను వినుము."

యీలోపునవాడు కిటికీ చట్రము తీయగలిగెను. మరియు దానిగుండా వెలుపలికివెళ్లుటకు ప్రయ

త్నము చేయుచుండెను. అదిచూచి దండప్ప గట్టిగా భార్యతో "వాడే గనుక తప్పించుకొని పారిపోయిన యెడల నీతల వెయ్యి తునకలు అయ్యే లాగున బ్రద్దలకొట్టుతాను." అని చెప్పి తనకున్న బలమంతా వుపయోగించి శక్తికొద్ది బలమైన దెబ్బ ఒక్కటి ఆమెతలమీద కొట్టెను. ఆమె ఎంతో ఆదెబ్బకు వోర్చి కదలక మెదలక అట్లనే నిలుచుండెను. సాధారణముగా ఆనొప్పికి కేకకూడా పెట్టలేదు. ఆమె తలమాత్రము దెబ్బ బలిమిచే నొప్పి వలన ఒకవైపుకి త్రిప్పుకుంది.

ఆదెబ్బ చప్పుడువిని ఆకుర్రవాడు వెనుకకు తిరిగి చూచెను. దండప్ప రెండవమారు మరల కొట్టుటకు చేయియెత్తి సిద్ధముగా వుండెను. అంబవ్వ యింకనూ బొమ్మవలె అట్లే కదలక నిలబడెను. ఆకుర్రవాడు ఆదృశ్యముచూసి వెంటనే తనమనసు మార్చుకొని ఆపైకిపెట్టిన కాళ్లు వెనుకకు తీసుకుని పరిగెత్తివచ్చి అంబవ్వ పక్కన నిలబడెను. పైకియెత్తిన దండప్ప చేతులుపట్టుకొని క్రిందకుదించి ఆచిన్నివాడు యిట్లు వేడుకొనెను. "దయచేసి అమ్మమీద మాత్రము మీ చేయియెత్తి కొట్టవద్దు. నేను మీతోవచ్చుటకు సిద్ధముగా వున్నాను."

దండప్ప వెంటనే ఆ చిన్నవాని చేతులు పట్టుకున్నాడు. అంబవ్వ ఆశ్చర్యముతో ఒక పెద్దకేక వేసింది. దండప్పవైపు చూస్తున్న చూపులు ఆచిన్న వానిమీద మరల్చింది. మరియు భర్తతో యిట్లు అనెను "నీయంతట నీవే బాగాచూడుము. ఆకుర్ర వాడు హంతకుడేమోను. నేను నీకు చెప్పినను నమ్మకములేదు."

దండప్ప ఆచిన్నవాని చేయి పట్టుకున్నప్పటికి బలవంతముచేసి తీసుకువెళ్లుటకు ప్రయత్నము చేయలేదు. వానిని గట్టిగా పరీక్షచేసి చూస్తున్నాడు. వానిచిన్నతనము భయముచే అజాగ్రత్త అయినటువంటి అపరిశుద్ధమైనటువంటి చూపులనుబట్టి వాని హృదయము కరగెను. వెనుక ఎప్పుడో తను చేయి చేసుకుని అంబవ్వను కొట్టబోతుంటే తనకొడుకు చచ్చిపోయిన పాండురంగడు ఆమెను కొట్టకుండా అడ్డము వచ్చెను. ఆదృశ్యము యిప్పుడు మరల జ్ఞాపకము తన మనసుకు వచ్చెను. ఆపోలిక తన కొడుకుకు వీనికి సరిపోయింది. తనకు తెలియకుండానే తన చేతితో ఆచిన్నవాని చేయిపట్టుకున్న చేయి తానంత తానే విడుదలయినది. తనకళ్లు కప్పినట్లు ఆశ్చర్యపోయినాడు. అంబవ్వ వైపుతిరిగి "యీపిల్లవాడు ఎక్కడకు పోకుండా చూస్తూవుండుము నేనుయిప్పుడే వస్తాను." అనిచెప్పి తన టోపి పెట్టుకు పైకి వెళ్లినాడు.

దండప్ప వెళ్లగానే అంబవ్వ ఆచిన్నవానివైపు తిరిగి యిట్లనెను- "దయచేసి ఎక్కడకన్నా వెళ్లిపో దైవము ఎట్లచేయదలచెనో అట్లుకానిమ్ము. నాభర్త మరల తిరిగివచ్చి ఏమిచేయునో ఎవరికి తెలుసును? యిక్కడ వుండవద్దు. వెళ్లిపో, పారిపో." అయితే! ఆచిన్నవాడు వినలేదు. అక్కడనుంచి కదలలేదు. అదిగాక ఆమెతో యిట్లనెను "అమ్మా! నాకు ఏమికోరికలులేవు. యికమీద భూమిమీద ప్రాణములతో వుండుట ఆశలేదు. పారిపోయినందువల్ల లాభము ఏమి? నాకు వచ్చునది ఏమి?"

అరగంట తరువాత దండప్ప తిరిగి వచ్చెను. అప్పుడు వాడు పోలీసు దుస్తులనుంచి మామూలు వాటికి మార్చినాడు. వాడు పట్టీబనీను పొట్టిలాగు మాత్రమే ధరించినాడు. యిదిచూచి అంబవ్వ ఆశ్చర్యముతో వానిని అడిగెను. "ఇది ఏమిటి? ఏమయినది?" దానికి దండప్ప "ఏమిలేదు. నేను యీరోజునుంచి నాపనికి రాజీనామా యిచ్చినాను. అంతే." అన్నాడు.

"నాకోరకే?" అన్నాడు ఆ చిన్నవాడు. "కాదు! నాస్వంతవిషయమై. నేను నాపనికి యిక సరిపడను, ఒకరి నౌఖరీచేసి అలసిపోయాను. నేను ఒక మనిషిమాదిరి వుండాలి అనేనాకోరిక. నాకొడుకు చంపబడ్డాడు. అదిచాలునాకు." అని బిగలు చెప్పెను దండప్ప. అంబవ్వ యిది విని ఆదేపనిగా కంటనీరు ధారగా కార్చినది. దండప్ప ఆమెను వోదార్చెను.

"ఇంతవరకు జరిగినది ఏదో జరిగినది, అది అంతా యిప్పుడు మరచిపోదాము! యీ సహాయములేని పెద్ద పట్టణములో యీరోజు ఆఖరురోజు. మనము యిక్కడ ఒకనిముషము వుండగూడదు. మనము యిక్కడ యిక వుండుట మంచిది కాదు. యీరోజు ఆఖరులాగు గడుపుదాము. నీవుకూడా యీ మహా పట్టణములో దాగి వుండుట ఎంతో చాలకష్టము."

"ఏమిటి! నేనుకూడానా!" అతనికి అడ్డువచ్చి ఆచిన్నవాడు అన్నాడు. దండప్ప అవు నన్నట్లు తల ఆడించినాడు. అంబవ్వ చెప్పుటకు వీలులేనంత ఆశ్చర్యము పొందినది. ఆమెకు సగము విచారము తొలగిపోయింది. అనుమానముతో భర్తను.

"అయితే అక్కడ ఎవరన్నా వానిని అనుమానపడితే?" అన్నది.

"అయితేనేమి. అక్కడ వానినిగురించి ఎవరికి తెలియును? మనము ఎల్లా అయితేనేమి యిన్ని సంవత్సరములు ఆపూరులో లేము. పాండురంగడు బ్రతికి వుంటే వీనిలాగు కాదా? బాగు, వాడుమనవాడును."

అని దండప్ప ముగించినాడు.

"మన కొడుకా!" అని ప్రతిధ్వనిగా అంది అంబవ్వ.

ఆచిన్నవాడు తల వంచి నిలుచున్నాడు.

మాంచాల మనోవేదన

భాషాప్రవీణ చోరగుడి హనుమత్ శేషమ్మ బి. ఓ. యల్.

పల్నాటి కథయందు, వీరుఁడుగా ప్రసిద్ధుడైన బాలచంద్రుని భార్య మాంచాల. పుట్టినింట నుండి పతిదర్శనమునకై పరితపించుచున్నది.

పండువెన్నెలలను యెండగాచెదు చంద్ర - పిల్లగాలిగూడ పిడుగయ్యె
మరుఁడు వేచఁ జొచ్చె మార్గంబులేదు - మా బాలచంద్రుదెమ్ము ప్రణతులిడుదు.

రాడని పల్కలేక యిటు - రాత్రిమువీడి చరింపఁబోదువే
మేడలసీడలందిరుగు - మేలుముసుంగుల మేనితారకల్
వేడరో నిన్ను వెంటఁబడి - వేదురులై విడిపోవనిత్తురె
మాడగ నోర్తురే వెనుక - మారునిమంటల కోర్వశక్యమే.

మోహమో ప్రేమ యోగాక ముద్దరాలి - సుద్దికడ్డముకలదొకో యొద్దియేది
పణతులకు బాధకల్గించి పరువఁగలరె - చంద్రుఁడైననుమరి బాల చంద్రుడైన.

బాలరారమ్మని బల్మికౌగిట జేర్చి - చిరుసిగ్గు దొంతరల్ చీరకున్న
చెక్కుచెక్కుననాన చిలిపి పల్కులఁతోడ - కొసరుచున్ ననుమరుల్ గొల్పకున్న
చిరునవ్వు వెన్నెలల్ చిలుకుచున్ గులుకుచు - తీపారుపల్కులన్ దేర్పకున్న
ఏకశయ్యాగత యేకాంత సౌఖ్యంబు - లేనాటికైననా కీయకున్న

విభుఁడురాడొకో వాంఛకున్ విజయమీడో - కలయఁ బ్రాకిన చీకటుల్ కదలుటెపుడో
ధర్మయుక్తంబు దాంపత్య తరుణసుఖము - మధువెయౌనొకో మరి సుధామధురమౌనో

మహనీయగుణగణ్య మాయత్తయైతాంబ - అదరింపదేలనో యాత్మసుతుని
బ్రహ్మసమానుఁడౌ బ్రహ్మనాయండేల - ఒప్పరికించెనో యోర్మిదాల్చి
వంశధర్మాచార వర్తనలెఱిగిన - శీలమ్మబాలు శిక్షింపరాదె
సర్వధర్మంబుల సారంబులెఱిఁగిన - వల్లభుండేలకో వదలెపథము

పిన్నపెద్దలు లేరొకో ప్రియము జెప్ప - వల్లమాలినసిగ్గునన్ వలచెగాక
ఎఱిగి నేనేలసేవింప నేగరాదు - కోపోయినదైవంబు కొలువనీడొ.

శైవము వైష్ణవంబనుచు - శంకలు రేపి మహామనీషులున్
కేవలమూఢులైయకట - కీడునుమేలును నెంచజాలకే
పూవులఁబూజసేయఁదగు - పుణ్యులపేరిట కత్తులూనుచున్
దావలమైనరోషమున - దార్కొని పోరగధర్మమానొకో

మతపుటగ్గులు మనసులన్ మాడ్చివేయ - ధర్మమార్గంబుగనలేక తండ్రులుండ
తల్లులకు లేదు ధైర్యంబు తరిమిచెప్ప - మనసదెట్లున్న నేమి నే మగువనైతి
పురుషుఁడాతండు రాఁడుగా పుణ్యమేమొ.
ధర్మార్థకామమోక్షసు - కర్మలలలో నిన్ను విడువ కామినియనుచున్
మర్మంబులేక పల్కితి - ధర్మమె నీపల్కు విడువ తరుణీమదనా

చిలుక గోర్వంకలంబోలి చెలగుదురని - పెద్దలూహించి చేసిన పెండ్లి యకట
ఇట్లుగా నేలదేవుని కెంతపగయొ - వల్లభుండేలదయమాలి వదలెనన్ను.

నవనవయౌవనాంబుధులు - నాటికి నాటికి బొంగిపొర్లగా
జవజవలాడు మేనిపస - చాయలు దేరగ చంద్రకాంతితో
దివము నుభూమియున్ గెలుచు - తేజముతోడుత రాజమూర్తియై
నవమరుబోలు నాథుగన - నాకికి నెన్నడు గల్గు నీశ్వరా

సకలసద్గుణసంశోభి చంద్రవిభున - కిట్టిదీనిందయేలనో యిందుధవళ
మైనవంశంబు తనచేత మైలపడునె - అకట బ్రహ్మన్నపట్టికీ యగడుతగునె.

ఎన్నటికైన కోరికల - నేకటదీర్చి యికేలబాలనిన్
ఎన్నడు వీడఁబోవనిపు - డేలుమునన్నిక వేడికొందునిన్
మన్ననసేయఁగా దగుదు - మారుని కోర్వను బ్రోవుమంచునన్
మన్ననసేయ నేవరుఁడు - మామకభాగ్యమదెట్టులున్నదో

కొలచితినిన్నుదైవమని - కోరిన కోర్కులనిత్తువంచు నా
వలపుల రాయనిం దెలిపి - వక్రపుమార్గమునుండి ద్రిప్పుమా
తలపుల నాపగాదరమె - తాళగఁజాలను దేవదేవ యీ
కలతలుదీర్చి మాహృదయ - కాంతులు దీర్పుము చెన్నకేశవా.

—(౦)—

(సశేషము)

చర్మ బాధలకన్నిటికీ



సైబాల్


చర్మవ్యాధులన్నిటిని శీఘ్రంగా నివారణచేసి, విషక్రిమి నాశనిగా త్వరితంగా కుదుర్చుటలో "సైబాల్" ప్రసిద్ధికెక్కింది. కురుపులు, గజ్జి, ఎక్జిమా, స్కాబీస్, మొటిమలు, తామర, కాళ్ల పగుళ్లు, వ్రణములు మొదలైన వాటిని కుదర్చడములో అద్భుతంగా పనిచేస్తుంది.



బిడ్డల ఆరోగ్యమునకు

ప్రసిద్ధిచెందినది:

రమణీస్
బేబిగ్రైప్





తయారీదార్లు:

ది సౌత్ ఇండియన్ మాన్యుఫాక్చరింగ్ కో., మధుర.

డిస్ట్రిబ్యూటర్సు:

సీతారామా జనరల్ స్టోర్సు ఏజెంసీస్ - విజయవాడ, శికింద్రాబాద్,
బరంపురము (గంజాం), బొంబాయి.

నైజగుణం

ఏకాంకిక

శ్రీ ఏకుమళ్ల కామేశ్వరరావు

(గతసంచిక తరువాయి)

[శీలశర్మ తిరిగివస్తాడు.]

భూష:-ఏమండి శర్మగారూ! నాగారావు గారు వచ్చేడా?

శీల:-ఆయనెక్కడ వస్తారండి మీవెఱ్ఱికాని! ఇంటిలో అతనిమాటలు వినబడుతూనే ఉన్నాయి. పైకివచ్చి అతని కూతురు మానాన్న ఇంటిలో లేడండి అని చెప్పింది. సెలవురోజున ఊరిమీద ఊరు పడ్డా బడిపని చెయ్యడని నాకు తెలుసు.

భూష:-అయితే ఏమిటి సాధనం?

శీల:-అతనిదంతా నటనండి భూషణం గారూ! ఏమాట చెప్పినా అబద్ధమే కదా, ఆఖరికి ఇప్పుడు టైం ఎంత యిందయ్యా అని అడిగినా కూడ అబద్ధమేకదా - అదేమి జన్మోకాని! అటువంటి మహాత్ముణ్ణి మీరు ప్రాణ స్నేహితుడని నమ్ముతున్నారు.

భూష:-శర్మా! నీకు అతనిలోతు తెలియ దంటే నమ్మను; చదువు చెప్పితే అతనే చెప్పాలి, ఆఫీసుపని చేస్తే అతనే చెయ్యాలి. కబుర్లు చెప్పితే అతనే చెప్పాలి!

శీల:-అతనిలాగు ఇచ్చకాలు మాట్లాడడం అందరికి చేతకాని మాట నిజమే! ముందర ముచ్చట్లు వెనక చప్పట్లు!

భూష:-ఎందుకండి ఇప్పుడా చర్చంతా! సద్యాళి పనిజరిగే ఎత్తేదేనా ఉందేమో చూడండి.

శీల:-ఆరిజిస్టర్లు నాముందర పారవేయండి ఏదో తంటాలు పడతాను.

భూష:-రిజిస్టర్లన్నీ అతని బీరువాలో చిక్కు పడిపోయేయండి శర్మగారూ!

శీల:-అదొక చిక్కు వచ్చిపడింది!

భూష:-ఇదిగో శర్మగారూ! మీరు శ్రమ అనుకోకుండా మరొక్కమారు అతని ఇంటికి వెళ్లి ఇంటిదగ్గరుంటే తక్షణం తీసుకు చక్కారండి. లేకపోతే ఇంటిలో అడిగి తాళాలు తీసుకు వేగిరం రండి. ఇక్కడున్నట్లుగా రావాలి. బయలు దేరండి.

శీల:-వెళ్లి ఇప్పుడే వస్తాను.

(వెళతాడు)

భూష:-శివ శివ! ఊరికార్డు పనికాదుకాని ప్రాణాలు ఎగిరి పోతున్నాయి. మనిషి మంచివాడయితే మట్టుకు ఎప్పుడూ

ఇంటిలో కూర్చుంటాడా! కాగితం సకా లానికి చేరకపోతే అదొక రిమార్కు బడి మేనేజమెంటు కాదు కాని తలప్రాణం తోకకి వస్తూంది. ఎప్పుడూకూడ ఎంత చాకిరీ చేస్తామో మరి అంత చాకరీ సిద్ధంగా ఉంటుంది. హా పరమేశ్వరా!

[వెట్టివాడు వస్తాడు.]

వెట్టి:-అయ్యా! బూసనం పంతులుగారూ! దణ్ణాలండి.

భూష:-ఏమిటిరా వెట్టిగా ఏమిటివిశేషాలు? మన మునసబుగారు క్షేమంగా ఉంటు న్నారుట్రా.

వెట్టి:-సిత్తం బాబుగారూ! ఆరే అంపే రండి తమరికాడికి. పొగాకు ఇనస్పెట్టారు ఊళ్లోకి వస్తారంటండి బస తమ బడి సావిడికాడ సేత్తారంట - కాస్త కాలీ సేయించమని అంపేరండి.

భూ:-ఎక్సైజు ఇనస్పెక్టరుగారు వస్తారా? హాలుసిద్ధంగానే ఉంది. వచ్చిన వెంటనే తీసుకు రమ్మన్నారని చెప్పరా! పో.

వెట్టి:-సిత్తం బాబయ్యాగారు! సెలవిప్పిం చండి.

భూ:-వెళ్లిరారా!

(వెట్టివాడు వెళతాడు)

[శీలశర్మ మళ్లీవస్తాడు.]

భూ:-ఏమండి శర్మగారూ! నాగారావు వచ్చేడా?

శీల:-వస్తే ఈపాటికి మీకు కనబడడూ!

భూ:-పోనీ తాళాలేనా తెచ్చేరా?

శీల:-తాళాలు మానాన్న జేబులో వేసు కొని వెళ్లిపోయేడని చెప్పమని కూతురి చేత చెప్పించేడు.

భూ:-అయితే నాగారావు ఇంటిలో ఉండే లేడనిపించు కొంటున్నాడనా మీ ఉద్దేశం.

శీల: అక్షరాలా అంతే!

భూ:-నేనెంతమాత్రమూ నమ్మను. మీకేం తెలుసు అతని గుణగణం! ఏదో పాపం ఈజరూరు అవసరం వస్తుందని ఎరగక ఎక్కడికో పోయాడు. ఇంతకీ ఈరాక పోకలలోనే పోస్టువేళ దాటిపో యింది లెండి. ఇంక ఈరోజున పాటు పడ్డాఫలితం దక్కదు. రేపటి సంగతి రేపు చూసుకుందాం. మీరు వెళ్లిరండి పాపం మీకు అనవసరంగా బోలెడంత శ్రమ ఇచ్చేను.

శీల:-అదినాకు శ్రమకాదు. నావిధి నేను చేశాను. చిత్తం సెలవు. వెళ్లివస్తాను.

భూ:-మంచిది.

(శీలశర్మ వెళతాడు) భూషణం ఇంటి లోకి పోతాడు.

[నాగారావు వస్తాడు.]

నాగా:-హెడ్‌క్వార్టర్సునుంచి వచ్చే ఒక మనిషిద్వారా రహస్యంగా తెలిసింది, డిప్టీ ఇనస్పెక్టరుగారు ఈ ఊరికి తణిఖీకి వస్తారని, అయితే ఈ అవకాశాన్ని ఎట్లాగుపయోగించు కోడమో ఇంత

వరకు తేలలేదు. (తలుపుతట్టి) భూషణం మేనేజరుగారూ! అయ్యా! పంతులు గారూ! నేనూ నాగారావుని.

['వచ్చే, వచ్చే' అంటూ భూషణం వచ్చి తలుపు తీస్తాడు.]

నాగా:-నమస్కారమండి భూషణంగారూ!

భూ:-మీ కోసం ఇప్పటిదాక చూస్తూనే వున్నాను.

నాగా:-అయ్యోపాపం! ఏమిటికథ.

భూ:-హెడ్ క్వార్టర్సునుంచి అర్జంటుగా జవాబు పంపమని ఒక కాగితం వచ్చింది దానికోసం మిమ్మల్ని పిలుచుకు రమ్మని పాపం శీలశర్మగారిని రెండుసార్లు పంపించేను. రెండుసార్లు కూడ కనబడ లేదంటూ తిరిగి వచ్చేడు.

నాగా:-అయ్యో! పాపం! ఎంతపని! నేను ఏదో అర్జంటు పనుండి బజారుకి వెళ్లేను.

భూ:-ఇదిగో కాగితం. ఇది అర్జంటుగా వెళ్లాలి.

నాగా:-అయితే ఈరోజుకి ఏలాగూ టపా వేళయిపోయింది. కదా! ఇవాళకి ఏమీ లాభంలేదు. ఒకపని చెయ్యండి- ఈరాత్రి ఏలాగో కిందా మీదాపడి స్టేటుమెంట్లు తయారుచేస్తాను. రేపుమీరు స్వయంగా వెళ్లి ఇనస్పెక్టరుగారికి దాఖలు చేసుకొని ఆలస్యానికి క్షమించవలసిందని కోరుదురుగాని. మిగత సంగతులేమేనా ఉంటే కనుక్కోనిరండి; వెళ్లిన వారెలాగు వెళుతున్నారు కాబట్టి.

భూ:-ఆ ఆలోచన బాగానే ఉంది.

నాగా:-నాకు సెలవామరి?

భూ:-వెళ్లిరండి. కాగితం సంగతి మొదలు చూడండి.

నాగా-ఇంకా చెప్పాలా! ఈరాత్రి తిండి లేదు, తిప్పలులేదు, నిద్రలేదు, విశ్రాంతి లేదు.

రాత్రినాపని తెల్లవారేక మీపని.

భూ:-ఆప్రకారమే కానియ్యండి.

నాగా:-సెలవు ఇప్పించండి.

భూ:-మంచిది. వెళ్లిరండి.

(ఇద్దరూ వెళతారు.)

అయిదోరంగం

[కరణంగారి ఇల్లు. కరణం ఏవో కాగితాలు చూసుకొంటూండగా నాగారావు వస్తాడు.]

నాగా:-అయ్యా! కరణంగారూ నమస్కారాలు.

కర:-ఏమిటి విశేషాలు నాగారావుగారూ?

నాగా:-లోకమంతా ఎప్పటిలాగే ఉంది. కాని మామేనేజరు భూషణంగారు ఊళ్లోలేదు.

కర:-ఏమి? ఎందుచేత?

నాగా: డిప్టీ ఇనస్పెక్టరాఫీసుకి ఏదోకాగితం

అందియ్యాడానికి వెళ్లేడు.

కర:-సరి! సరి!

నాగా:-ఇది ఇలాగుండగా డిప్టీ ఇనస్పెక్టరు గారు ఈ ఊరికి చర్యా వస్తున్నారని ఇప్పుడిప్పుడే తెలిసింది.

కర:-అదోకటా! తణిఖీ కేనా?

నాగా:-కాకపోతే! ఈసారికి వారిమకాం మీా ఇంటిలో పెట్టిద్దామని చూస్తు న్నాను.

కర:-అభ్యంతరం లేదు. అలాగే కాని య్యండి. ఏమంత బ్రహ్మాండమని.

నాగా:-మరినాకు సెలవిప్పించండి. నేను బడికి వెళ్లివస్తాను. అక్కడుండకపోతే అదోక రొష్టాయె!

(నాగారావు వెళతాడు)

కర:-వెళ్లిరండి. వీధిగది కాస్తశుభ్రం చేయిం చాలి! ఒరే చొప్పడూ!

['బాబయ్యగారూ!', అంటూ చొప్పడు వస్తాడు.]

ఒరే చొప్పడూ!

చొప్ప:-అయ్యగారూ!

కర:-వీధిగదంతా శుభ్రంగా తుడిచేసి కాసిన్ని నీళ్లుచల్లి, ఒకమంచం, ఒక పరుపు, ఒకకుర్చీ, ఒకచాప అక్కడ అమర్చిరారా! స్కూళ్ల డిప్టీ ఇనస్పె క్టరుగారు వచ్చి మకాం చేస్తారురా!

చొప్ప:-సిత్తం బాబయ్యగారూ.

(వెళతాడు)

[డిప్టీ ఇనస్పెక్టరుగారి బంట్రోతు వస్తాడు.]

బంట్రో:-బాబూ! కరణంగారూ! దణ్ణాలండి!

కర:-డిప్టీ ఇనస్పెక్టరుగారి బంట్రోతువి కాదుటోయ్‌నువ్వు?

బంట్రో:-ఔనండి అయ్యగారూ!

కర:-ఆలాగు చెప్పు. కిందటిమాటుకంటే బాగా బలిశావులే! అందుచేత...

బంట్రో:-ఏటోనండి! అంతా తమరి దయే నండి.

కర:-మాదయేమిటి! అంతా మీా మేష్టర్ల దయే! మరేమిటి విశేషాలు? అప్పిడే ఇనస్పెక్టరుగారు దయచేశారా?

బంట్రో:-ఔనండి అయ్యగారూ! నాగా రావుపంతులుగారు తమతో చెప్ప మన్నారు.

కర:-అంతా సిద్ధంగా ఉంది. దయచెయ్య మన్నారని త్వరగా చెప్పు.

బంట్రో:-వెళ్లొస్తానండి.

కర:-మంచిది.

(బంట్రోతు వెళతాడు)

[చొప్పడు వస్తాడు]

కర:-ఒరేయ్ చొప్పడూ! ఏమిచేశావురా?

చొప్ప:-బాబయ్యా! అంతా చిద్దంగా ఉందండి.

(చొప్పడు వెళతాడు)

(సశేషము)

రాష్ట్రభాషగా సంస్కృతము



సంస్కృతభాష మొదటినుండియు మహోదాత్తమైన చరిత్రగలది. రాజాధిరాజులయు, మహారాజులయు, చక్రవర్తులయు మన్ననలందినది. వారేకాక ప్రజలెల్లరును నీభాషను శిరసావహించియున్నారు. ఇంతేకాక సమస్తమైన కళలు, జగదుపకారక విద్యలు, వృత్తివిద్యలు, విద్యకు సంబంధించిన వ్యాకరణము మున్నగు శాస్త్రములు, శరీరమును బాగుచేయు ఆయుర్వేదము మొదలగు వైద్యాది శాస్త్రములును, మనస్సును బాగుచేసి శాశ్వతానందానుభవమును జేకూర్చు యోగము మున్నగు నాధ్యాత్మిక శాస్త్రములును, గణితము మున్నగు నైహిక శాస్త్రములును ఈ భాషలో నున్నవి. ఈ భాషలోని యీ గ్రంథము లెట్లు మానవుని సర్వోన్నతికిఁ గొనిపోయి, సుఖింపఁ జేయునో యీ క్రింది పద్యమున గ్రహింపవచ్చును.

"యోగేన చిత్తస్య పదేన వాచాం
మలం శరీరస్య చ వైద్యకేన
యోఽపాకరోత్ తం ప్రవరం మునీనాం
పతంజలిం ప్రాంజలి రానతోఽస్మి"

సంస్కృత భాషలో పతంజలి మహాముని "పాతంజలయోగసూత్రములు" వ్రాసి చిత్తము నిర్మలమగు విధానమును సూచించెను. మఱియు వైద్య గ్రంథమును వ్రాసి, శరీరము నిర్మలమై శారీరకానందము గల్గు విధానమును సూచించెను. ఇట్లు మానవునకు సర్వోన్నతి గలిగించి యానంద డోలికల నిల్పునది సంస్కృతభాష.

అంతియేకాక యనిత్యమైన ఐహికానందము నేకాక శాశ్వతమై, పునర్జన్మరాహిత్యముచే లభించు మోక్షసామ్రాజ్యానందమును గల్గించు భగవద్గీత, ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రములు, వాని భాష్యములును ఈ భాషలోనే యున్నవి.

దేవతలచేఁగూడ వాడబడుచు పరమపావనమైనదిగా భావింపఁబడుచు "గీర్వాణవాణి" యని పేరు గాంచినదీభాష.

మానవుఁడు భూమిపై జనించినది మొదలు జాతకర్మ నామకరణాది సర్వ సంస్కారములును జీవితాంతము వఱకును జీవితానంతరమును నీభాషతోనే జరుపఁబడుచున్నవి. అయిన, వెనుకటి కాలమున దాని యర్థమును దెలిసికొని యీ యా సంస్కారములు జరిపెడివారు. ఇప్పుడయినను అర్థము తెలిసియో తెలియకయో యీ భాషతోనే జరుపుచున్నారు.

ఈ భాష భోజాది మహారాజులచేతను, కాళిదాసాది మహాకవులచేతను జక్కఁగాఁ బోషింపఁబడుచు మహోన్నతి కొక కాలమున వచ్చినది. ఇప్పుడయినను జాలమందిచే నాదరింపఁబడుచునే యున్నది. బొంబాయి, కలకత్తా మున్నగు రేడియోలలో సంస్కృతభాషా కార్యక్రమములకుఁగూడ స్థానమొసంగుచునే యున్నారు.

అట్టి యీ సంస్కృతభాష రాష్ట్రభాషగా నంగీకరింపఁబడుట కెట్టి యభ్యంతరమును నుండరాదు.

అయినను నిది జీవద్భాష కాదనియు, ఒకప్పుడును సర్వజన వ్యవహారములో నున్నది కాదనియు, ఇప్పుడును నట్లే యుండటి వ్యవహారమున నుండఁదగినది కాదనియు, గొందఱభ్యంతరములు చెప్పుచున్నారు.

కొందఱీభాష కఠినమైనదనియు, దాని యుచ్చారణ సుఖసాధ్యము కానిదనియు, నిది త్వరగా నభ్యసించుటకు వీలు కాదనియు, దానినే పట్టుకొని వ్రేలాడుచుఁ జాలకాల మభ్యసించినఁగాని యీ భాష రాదనియు, అడ్డంకులు వేయుచున్నారు.

ఇది జీవద్భాష యిప్పుడు గాకున్నను నొకప్పుడు జీవద్భాషగానేయుండి, మార్పులను జెందియున్నదని ప్రాకృత సంస్కృతభాషా విపరిణామమువలనఁ దెలిసికొనవచ్చును. అనఁగా ప్రాకృతభాషయే సంస్కృత భాషగా మారినప్పుడు కాలికములైన మార్పులు దీనిలో లేవని చెప్పుట యొప్పదుగదా!

అదిగాక పాణినిమహర్షి తన వ్యాకరణములో సూచించిన ప్రకారము "దూరాద్ధూతే" అన్నప్పుడు "జేః ప్రాచాం" అని ఆ విషయమునఁ

గొందఱికిని తనకును మతభేదమున్నట్లు చెప్పుటను బట్టియు, నీభాషకు జనుల వ్యవహారమునఁ గొన్ని మార్పులు వచ్చినట్లు తెలియుచున్నది. అనఁగా దూరముగానున్న వ్యక్తిని బిలుచునప్పుడు ఆ వ్యక్తి పేరులోని చివరియచ్చును అతి దీర్ఘముగా నుచ్చరింపవలెనని తానుజెప్పి, ఒక నదిని హద్దుచేసికొని ఆ నదికి అవతల భాగముననున్నవారు, ఆ వ్యక్తి పేరులోని మఱికొన్ని యచ్చులను అతి దీర్ఘముగాఁ బలుకవచ్చునని యనిరని చెప్పెను. దీనిని బట్టి యిది యప్పటి యందఱి వ్యవహారములోను సామాన్య భాషగా నున్నట్లు తెలియును.

ఇది యొకప్పుడు సర్వజన వ్యవహారములోను నున్నది కావుననే సర్వజన దర్శనీయములగు నాటకములీభాషలో (శాకుంతల, వేణీ సంహారాదులు) వెలువడుటయే కాక యాయా యుత్సవములలో నాయా సందర్భములలో నీనాటకములు ప్రదర్శింపఁబడినట్లును తెలియుచున్నదనియు, పాణినీయ వ్యాకరణమునందు దూరమునుండి యితరుని బిలిచినప్పుడు చివరియచ్చునకుఁ బ్లుతము వచ్చుననియు, కొందఱు అందలి యే యచ్చునకైనను ప్లుతము వచ్చునని చెప్పిరనియు వ్రాసియుండుటచే దేశభేదమునుబట్టి యాయా మార్పులు సూచింపఁబడుటచే దేశమందంతటను నీభాష వాడఁబడినట్లు తెలియుచున్నది కాన నిది యొకప్పుడు సర్వ వ్యవహారమున నున్నట్లు తెలియుచున్నదని కీ. శే. మహామహోపాధ్యాయ తాతా సుబ్బరాయ శాస్త్రి గారు నిరూపించియున్నారు.

ఈ వ్యాకరణాంశమునుబట్టి ఆయా దేశములలో నుండువారేయే విధముగాఁ బిలుచుచుండిరను నంశము తెల్లమగుచున్నది. ఇది జీవద్భాషా లక్షణమేకదా !

ఈ సంస్కృతభాష గృహలక్ష్ముల వ్యవహారములో సైతముండి వారిచేఁ దమబిడ్డలకు నేర్పఁబడుచు, వంటయిండ్లలోఁగూడ నొకప్పుడు మాట్లాడఁబడుచు నుండెడిదని శ్రీ కాశీ కృష్ణాచార్యులుగారు తమ బాలబోధిని యుపోద్ఘాతములో నిరూపించియున్నారు.

అంతియే కాక గృహలక్ష్ములు సయితమీభాష వాడియుండిరనుటకు ప్రబల నిదర్శనముగా నొకకథ, చరిత్రాత్మకమైనది యున్నది.

శాతవాహనుఁడనురాజు పాలిభాషలో గొప్ప నేర్పరి కాని సంస్కృతభాష ఆయన కంతగా రాదు. పిదప ఆయన రాణులలో గొప్ప సంస్కృతభాషా పాండిత్యముగల వారుండుట తటస్థించెను. అప్పుడొక రోజున రాజు రాణులతో జలక్రీడలాడుచుండఁగా, రాజు నీళ్లనెక్కువగా నొక రాణిపైఁ జల్లుచున్నప్పుడామె "మోదకైస్తాడయ" అని యనెను. అప్పుడు రాజు "మోదకైః — పిండి వంటలతో, తాడయ — కొట్టుము" అని ఆ వాక్యమున కర్థము చేసికొని పిండివంటలు తెప్పించి వానినామెపై విసరెను. అప్పుడా రాణి తాననిన వాక్యమునకు "మా + ఉదకైః + తాడయ" అని పదవిభాగము చేసికొని, "ఉదకైః — నీళ్లతో, మా, తాడయ — కొట్టవద్దు" అని అర్థము చేసికొనలేకపోయెనని యతని సంస్కృతభాషానభిజ్ఞతకు ఎగతాళి చేసెను. అప్పుడాయన తనకు సంస్కృతభాష రామిచే స్త్రీలచేఁ బరిహసింపఁబడితినని చింతించి, సంస్కృతభాషను నేర్చుకొనఁదలఁచి, యాభాషను త్వరలో నేర్పువారెవరని యన్వేషింపఁగా, గుణాఢ్యుఁడనుకవి తానారునెలలలో సంస్కృతభాషను నేర్పెదనని ప్రతిజ్ఞ చేసి యట్లే నేర్పెను.

దీనిచే సంస్కృతభాష నా రోజులలో స్త్రీలు గూడ నెంత విరివిగా నేర్చుకొనెడివారో తెలియుటే కాక, "సంస్కృతభాష చాల కాలము కష్టపడి చదివినఁగాని రాదు" అను కొందఱివాదము విశ్వసింపఁదగినది కాదనియు, సంస్కృతభాష నారునెలలు మంచి యుపాధ్యాయునివద్ద కృషిచేసిన చక్కఁగా నేర్వవచ్చుననియు తెలిసికొనవచ్చునుగదా ! మఱియు ఆంగ్లభాషలో కష్టముగా నుచ్చరింపదగు పదములుండలేదా ? హిందీలో మాత్రములేవా ? అందుచే అది అభ్యంతరము కాదు. కాననిట్లు సర్వజన వ్యవహారమున నుండి అందఱిచేతను మన్నింపఁబడిన సంస్కృత భాషను రాష్ట్రభాషగాఁ జేయుట బాగుగానుండును.

ఎక్కువమంది నేర్చియున్న (హిందీ) భాష రాష్ట్రభాషగా వలెననుట యొప్పుకొనఁదగినదిగానుండదు. ఉత్తర భారతీయులకా భాష సులభ గ్రాహ్యమై యితరులకది సుగ్రాహ్యము కాకపోవచ్చును. అందుచేఁ గొందఱియందు పక్షపాతము చూపినట్లగుచున్నది. సంస్కృతభాష నేర్చుటలోనో — అందఱికిని కష్టసుఖములు సమానములే. అన్ని ప్రాంతములకును నీ భాష సామాన్య భాషయేకదా! కావునఁ గొందఱియందు పక్షపాతము చూపినట్లు కాదు.

కాన నిష్పక్షపాత పద్ధతి నవలంబించి యీ సంస్కృత భాషనే రాష్ట్రభాష చేయుటవసరము.

ఈ సంస్కృతభాషలో చాల విషయములను సంగ్రహముగా కొద్ది మాటలతోఁ జెప్పుటకుఁదగిన సంక్షేప పదములు, పదములయొక్కయు, అక్షరముల యొక్కయు విరుపువలన విశేషార్థములును, అర్థభేదములును గలుగునట్టి పదములు వాక్యములు నుగలవు.

మఱియు నీ భాష యిదివఱలోఁ గొంతకాలము రాజకీయ వ్యవహారమునకున్నదే కావున రాజకీయ పారిభాషిక పదములకు, సాంకేతిక పదములకును ప్రత్యేకముగా వెదకుకొనవలసినపని లేదు.

కాన నెల్ల సద్భాషాలక్షణములుగల యీ భాషయే రాష్ట్రభాషాత్వమునకుఁదగినది.

కావున నీ విషయముల గ్రహించి గృహలక్ష్ములు రాష్ట్రభాష సంస్కృతమే యగునట్లాందోళన జరుపుదురుగాక!

అవ్వారి వాసుదేవశాస్త్రి

సంస్కృతభాష రాష్ట్రభాషగా నుంచుటకు మనలో కొంతమంది వెనుకంజవేస్తున్నారు. సంస్కృత భాష కఠినమైనదికదా అని, అందరూ అలవర్చుకోగలరా అనే సందేహమే యిందుకు కారణము. కాని అభ్యాసంవల్ల అన్నియు సులభగ్రాహ్యము. సంస్కృతము మన మాతృభాషకదా! తల్లి మాటలు పిల్లలకు బోధపడవా? ఏమిటి పూర్వం భోజరాజు కాలములో సంస్కృతభాషయే వాడుకలో యెక్కువగా నుండేది.

ఒకరోజు భోజరాజు వాహ్యాళికి వెళ్లివస్తుండగా దారిలో ఆరుసంవత్సరముల ఈడుగల ఒక అమ్మాయి యెదురయినది. ఆ అమ్మాయితో భోజరాజు ఈ విధంగా సంభాషించెను.

భో॥ కావాఃబాలా (నీ వెవరవు)
అ॥ కాంచనమాలాః (నేను కాంచనమాలను)
,, కస్యాం పుత్రీః (ఎవరి పిల్లవు)
,, కనకలతాయాః (కనకలత కూతుర్ని)
,, కింహస్తే (నీ చేతులో వున్నదేమిటి)
,, తాళజఃపత్రం (తాటాకుల పుస్తకం)
,, కావాఃలిఖితం (ఏమిటి వ్రాసావు)
,, కఖఃగఘః (కఖ గఘ)

అని ఈ విధంగా సంస్కృతములోనే ఉత్తర ప్రత్యుత్తరములు జరిగినవి. అభ్యాసం కూసువిద్య అని, అభ్యాసంవల్ల రానిదేమీ వుండదు.

కాబట్టి మనమాతృభాషయైన సంస్కృతమే రాష్ట్రభాషగా వుండుటయె సమంజసము.


దారాలక్ష్మి

ఒక గ్రామానికి నూతనంగా వచ్చిన వ్యక్తి అక్కడి వాళ్లతో "నేను న్యాయ మార్గాలలో జీవనం గడుపడానికి వచ్చాను" అన్నాడు.

"మంచిది. మీతో పోటీ చెయ్యడానికి మేము ఎవ్వరము సిద్ధంగాలేము" అన్నాడు ఒకాయన.

ఒక బ్రహ్మచారిణి, సంఘసేవకురాలైన ఒక యువతి నలుగురు బిడ్డలుగల స్త్రీతో "చూడమ్మా! నీవెంత బలహీనముగా నున్నావో. ఇప్పుడైనా నీవు సంతాన నిరోధానికి చికిత్స పొందితేగాని నీ ఆరోగ్యం చక్కబడదు" అన్నది.

"క్షమించండి. నేను మీవలె అవివాహితనుగాను సంతాన నిరోధానికి చికిత్స పొందేందుకు" అన్నది నలుగురు బిడ్డలతల్లి.





గోధుమపిండికుర్మా

సేరు గోధుమపిండి, అరపావు సెనగపప్పు, పావుసేరు నీరుల్లి, ఒకచిన్న వెల్లుల్లిగడ్డ, అణా కొత్తిమిరి ఆకు, పావు టొమాటోలు, 2 చెంచాల ధనియాలు, ఒక చెంచా పసుపుపొడి, 14, 15 పచ్చిమిరపకాయలు, ఆరు ఎండు మిరపకాయలు, పావులేక అర్ధసేరు ఉర్లగడ్డలు.

రొట్టెలకు కలుపుకునే విధంగా, సేరు గోధుమపిండిని కలిపి నాలుగు గంటలసేపు మూతపెట్టి ఉంచి, తరువాత రెండు బక్కెట్ల నీళ్లతో దీనిలో ఉన్న పొట్టునంతా కడిగివేస్తే, పిండి రబ్బరు ఉండలాగు తయారవుతుంది. ఈ ఉండను ఒక అంగుళం దళసరి నాలుగయిదు ముక్కలుచేసి, పావుసేరు సెనగపప్పుతో ఉడకపెట్టాలి. సెనగపప్పు ఉడికితే, పిండిబిళ్లలుకూడా ఉడికాయన్నమాట. ఇప్పుడు బిళ్లలను వేరుగాతీసి, యింకా చిన్నముక్కలు చేసి, నేతిలో వేయించి అట్టే పెట్టుకోవాలి.

నీరుల్లి, పచ్చిమిరపకాయలు, ఎండు మిరపకాయలు, వెల్లుల్లి, ధనియాలు, కొత్తిమిరి అన్నిటిని ఒకేమారు నీళ్లులేకుండా నూరి నేతిలో వేయించాలి. చెక్కుతీసి ముక్కలుచేసి పెట్టుకున్న ఉర్లగడ్డలు, పసుపు, ఉప్పు, కూడా కలిపి కొద్దిగా వేగగానే అరసేరు నీళ్లుపొయ్యాలి. ఉడుకుబట్టేక పిండి బిళ్లలు టొమాటో ముక్కలువేసి బాగా ఉడికించాలి. ఒక అళాకు పుల్లపెరుగువేసి అయిదు నిమిషాలయిన తరువాత దించి, సువాసనకు కొద్దిగా కొత్తిమిరి కలపాలి.

ఈకూర రొట్టెకు అన్నానికి కూడా చాలా రుచికరంగా ఉంటుంది. ఉడికిన సెనగపప్పు వృధా పోకుండా ఉండాలంటే ఎనిపి, ఉప్పుకారం కలిపి బొబ్బట్టులో పూర్ణంలాగు, రొట్టెలమధ్యపెట్టి, తయారు చేస్తే, రొట్టెలుకూడా చాలా రుచికరంగా ఉంటాయి.

కానుకొల్లు వనజ.

పనసకాయకూర

లేతపనసకాయ పైతోలు $\frac{1}{4}$ అంగుళము చెక్కివేసినపుడు అది తెల్లగానుండి ఉడుకును. ఎఱ్ఱనిది ఉడుకదు. తోలు చెక్కిన వెనుక దానిపై కొంచము మంచి నూనెరాచి ఉంచవలెను. లేదా కాయను పెద్ద పాత్రలోబెట్టి దానిని $\frac{3}{4}$ వరకు నీటితోనింపి పొంగించి ఒక గంటకు క్రిందికి తీసికొని, పదునుండు కత్తితో కొట్టినచో పొడిపొడిగా పడును, కాయమధ్య కాడను కూరకు వాడకూడదు. కొంచెము నీళ్లు పాత్రలోపోసి పొయిపైపెట్టి కొంచము మంచినూనె దానిలోవేసి ఒక తులం పసుపుపొడియువేసి, పనస కాయ ముక్కలను పైజలమునువేసి, మూతపెట్టి, ఉడికిన వెనుక, అరతులం ఉప్పు పొడి (చాలినంత) కూరపైజల్లి, గరిటకాడతో కలిపి, మూడు నిముషములైన వెనుక క్రిందికిదించి, నీరంతయు వంచివేసి, మంచి నూనె ఎండుమిరపకాయ ముక్కలు, ఆవాలు, మినపప్పు, కరివేపాకులతో తాలింపుచేయవలెను. మరియు పచ్చిశనగలు చారెడు తీసికొని వానిపై నీరుజల్లి తడిచేసి, తిరగబోతలోవేసి, ఎఱ్ఱగా వేగిన వెనుకనే పనస కాయను అందులోవేసి కలిపి క్రిందకి దించుకొనవలయును.

వాసిరెడ్డి సుశీలాదేవి.

బాలాంబ

శ్రీ వేదము వేంకటకృష్ణశర్మ గారు

(గతసంచిక తరువాయి)

౫

శ్రీసకలధారుణీ చక్రశాసకుండు
దారితారాతిగుణుఁడత్యుదారగుణుఁడు
కొండవీటిమహాదుర్గమండలపతి
శ్రీప్రతాపుఁడు, చినవేమ రెడ్డి నృపతి॥

పాలకోట సామంతునిఁ, బరమహితుని,
శ్రీయుతుని, బోతరెడ్డిఁ జిరాయు వెసఁగఁ
బూజితాష్టవిధైశ్వర్యములు సెలంగఁ
బ్రేమదీవించి, యిడునాజ్ఞయేమనంగ:-

నీవుపాలించు రాజ్యాననెలవుకొన్న
పాలకోట ప్రజల్ మమ్ముఁబ్రభులటంచుఁ
దలఁపరఁట! మా యెడంబత్తిఁదలఁగి, యొరుని
నొకనిఁజేనిగనిల్పఁబూనుకొనిరంట॥

విశ్వసింపఁగఁదగువారు వినుచు కతన,
నిది నిజంబగు వార్తయం చెదకుఁదట్టెఁ
గాన, నీపట్ల, నీకమ్మఁ గాంచినంతఁ
దప్పకయ, నీవొనర్పఁగఁదగును నిట్లు॥

ఇది కల్లయొ, నిజమో, యని
యెద నాలోచించుచూరకేఁ కాలమ్మున్
వదలిచననీక, మఱుదిన
ముదయమ తెగఁజూడు, కోటనున్న ప్రజాళిన్

బవరముల నిపుణులైన యేఁబండ్రుబంట్ల
వేఁగుసరికంపువాఁడ, నీవీడుసేర

దయయు దాక్షిణ్యమిసుమంత దలఁపకుండ
వారిచేఁబూర్తిసేయింపవలయుఁ బనిని॥

ఆజ్ఞతుదముట్ట నెఱవేఱు నంతదనుక
రెండవ చెవికి సోఁకనీకుండవలయుఁ
గడకు నీసతికేని సంగాతికేని
నీరహస్యమాడకుము, హుషారుసుమ్ము॥

దీనినుల్లంఘనము సేయఁబూను నెడలఁ
బాత్రమగుదువు మా క్రోధవహ్నికీవు;
అంతియేగాక, రాజ్యముఁ బ్రాణవితతిఁ
గోలుపోవుట నిజమనుకొనుము, కనుము॥

మా ప్రభుత్వానఁ గలతక్కుమండలముల
జనులు చెలరేఁగుదురు వీరిననఁపకున్న,
మొదలనే;- యిదియూహింపు; "మొక్కయపుడ
వంచరానిది ప్రమానైన వంగునొక్కొ!"॥

ఓయి, మిత్రమ! వినుము, మఱొక్కమాట,
'గోటఁబోయెడు పనిఁదీర్ప గొడ్డలేల?'
కనుకఁ, 'గొఱవిని దలగోఁకికొనక, మాకు
వేక్క సలుపుమ, యిటు-చినవేమనృపతి॥

స్వామియాజ్ఞను, ఈరీతి వల్లభుండు
చదువుచో గూఢముగ బాల యదిగ్రహించి
యమితచింతాకులిత హృదయమున, నకట!
'కంచెయే చేను మేయునా?' యంచువగచె॥

౬

'ఆప్రభుఁ, డిట్టి కఠినతరాజ్ఞ, నేల
యిచ్చె'-నని మది శంకింతువేమొ, సీత!
సుందరీదేవి మాపై నసూయ గలది
కానఁ దనపగ సాధింపఁదలచె, నిట్లు॥

మా ప్రభుత్వాన సుఖముమై మనెడు ప్రజల
స్థితిగతులు విన్న, సుందరీదేవి శ్రవణ
కుహరముల కవి ముల్కులై యుహరహమ్ము
హింసఁ గలిగింప మా ప్రజ నేఁచఁదలఁచె॥

'పాటుకుఁ దప్పెఁగదా'-యని మురియుచుండఁ
బిడుగుపాటుగ రాజాజ్ఞ పడియె నెత్తి,
'నీడదొరకెఁగదా' యని తాఁడిక్రింది
కరుగఁ దానిఫలము పడి యగిలె శిరము॥

'ఎచటి కేఁగిన నాపద లేల తప్పు
భాగ్యహీనుల'-కని బుధుల్వల్కు-పలుకు
వితయగునె? కానిచోఁ, గొండవీడదేడ?
పాలకోట యిదేడ? యీ పాటులేడ?

పాడిదప్పని యేలినవారు ప్రభుని
యానఁ దలఁదాల్చుటే ధర్మమైన - మాకు
శాశ్వతాపయశము దీన సంభవించు
నరకమునుగల్గుఁ, దలయెత్తి తిరుగనగునె?॥
ఒనరుపఁగరా, దొనర్పక యుండరాదు,
కనుక, నిది 'ముందు గోయియు, వెనుక
నూయి'
యన్నస్థితి యయ్యె-నీ సమంబునందుఁ
దోఁచె నామది నొక్క-యాలోచనంబు॥

లేఖలో విషయమ్ము లేలిన ప్రభువులు
చెప్పకయ, నాకుఁ దెలియుటచేతఁ, బాల
కోట వాసుల నెల్లర ఘోరవధకుఁ
దప్పి, మనఁజూచు టెంతయుఁ దగవుగాదె।
ఇదిగో! నాయంగుళీయక, మిది గ్రహించి
కొండ దిగిపొమ్ము, మాపాలకోటపురికి,
నచటఁ జదుకములన్నిల్పి, యంపఱకును
వినెడుగతి బిగ్గఱగ నిట్టులనుము, సీత!॥

"రాణి బాలాంబ యీనగరమ్ము వదలి
పోయి, మిము యోజనముదూరమున నొకింత
కాలము వసింపఁగోరె, మీమేలునెంచి,
కానఁ, బ్రాణాల నాసింతురేని చనుఁడు॥

ఇచట మీయిండ్ల ధనధాన్యనిచయమెల్లఁ
గడు-సురక్షితముగ నుండుఁ గాన, రాజ్ఞి
యాన నొదలఁదాల్చి వేగాన మీర
లరగడియలోనఁ బురినుండి యరుగవలయు"॥

అంచు బిగ్గఱగాఁ జాటి యంగుళీయ
కమ్ము నానవాలుగఁ జూపు, కష్టమనక,
ప్రజలఁగావంగ, ధర్మసంరక్ష సేయ
నెట్లు తగునట్టు లొనరింపు, మిపుడ చనుము॥
బాలమారాణి తనచేటిఁ బంపి యిట్లు
కోటలోనికిఁ జనెఁగాని, గుండెబరువు
తొలఁగదయ్యె; నెడంద యుయ్యెలవిధమున
నూఁగఁదొడఁగె, విచారముల్ రేఁగి కలఁచె

౨

బాలసూర్యుని లేయెండ మేలితళుకు
సకలదిశలకు జేగురుచాయఁ బూయఁ
బ్రాణులరగంట, ఱెక్క-చప్పట్లఁ బులుఁగు
లలఁతినగవునఁ బ్రసవము లరయఁదొడఁగె॥
లోకబాంధవ మృదుకరాస్తోకసుఖులు
తీవ్రకిరణోష్ణహస్తాల దిగులుగనరె?
పోతరెడ్డి యేల్బడి నెమ్మిఁ బొదలు పౌరు
ల్లప్రతాపుని పిడల నడలురీతి॥

(సశేషము)



పునర్వివాహ తత్త్వము



శ్రీ సిరాఘాటం కుమారస్వామి

'సంసారం సాగరం దుఃఖమ్' అనేదాని కను కూలంగానే వుంటుంది నాపనెప్పుడూ. దీని జంజాటంలో క్షణంకూడా తీరికనే మాటుండదు. దానితోపాటే ఆదాయంకూడాలెండి! ఉదయాన పదిగంటలకు లేవడం, 11 గంటలకు కాఫీ దేవతార్చన, 1 గంటకు భోజనం, 3 గంటలదాకా నిద్ర, నేటి వరకు విశ్రాన్తి, అక్కడనుంచి స్నేహితుల్తోటి హాస్కు, అస్తమానంతో ఇంటికి జేరడం. ఇది సామాన్యంగా దినచర్య. అప్పుడప్పుడు విశేషంగా సంగీతం, చీట్లు, బ్యాడ్మింటన్ వగైరాలుంటూ వుంటాయి. సాధారణంగా యివన్నీ సలక్షణంగా జరుగుతూంటాయిగాని, హాస్కు దగ్గర కొచ్చేసరి కొస్తుంది యెక్కడలేని రిస్కు. మరి యెవరిపని యెవరు మానుకుని వస్తారు చెప్పండి! అందులో నాకు మరీని. ఎందుచేతంటే, యీ కాలపు నవ నాగరిక భావ కవుల కథలకు, కావ్యాలకు ఇతి వృత్తాలుగావుండే ప్రణయము, విరహము, శోకం మొదలైన కథా విశేషాలను ఉపన్యాస ధోరణితో, కవితా వేశంతో చదువుతూ వుండేవాణ్ణి మా స్నేహితుల దగ్గర. దాంతో వాళ్లు ఊపిరాడక వుక్కిరి బిక్కిరై పొయ్యేవాళ్లు పాపం! అందుచేత మా స్నేహితులంతా నన్నుచూచి తప్పుకు పోతూంటారు ఏదో జంతువును చూసినట్లు.

అది ఆషాఢ మాసారంభం. నాహాస్కు టైంకెవ్వరూ దొరక్కపోవటంవల్ల ఆనాడు నేనొకణ్నే ఏమిరా భగవంతుడా అని ఆలోచిస్తూ యేంతోచక మాపేటేంటి బీచి అని పిలుకబడే పిల్లకాలువకు షికారు వెళ్ళా.

తొలకరి తర్వాత మొలచిన చిరుగరికలతో నిండిన నేలంతా ప్రకృతిమాత విహార భూమిపై పరిచిన తివాచిలాగావుంది. నలుప్రక్కల వాలివున్న నీలాకాశం చాందినీలాగావుంది. అక్కడక్కడా పూచిన పలురకముల చిన్నిచిన్నిపూలు దానికెన లేనివింత సొబగును కల్పిస్తూన్నాయి. చీకూ చింతా లేక పారుతూన్న చిన్నకాలువ, పరమాత్మపై మనసును బరపు స్థిత ప్రజ్ఞుని జీవన ప్రవాహాన్ని జ్ఞాపకం చేస్తోంది. అరగంటలో అస్తమించనున్న సూర్యుని అరుణారుణ కాంతులు వైచిత్ర్యానికి మరింతవన్నె దెస్తూన్న ఆ సౌందర్యం నాస్తికుల జ్ఞాన శూన్యతను గూర్చి నవ్వుతున్నట్లుగావున్న ఆ అందాన్నిచూసి ఆశ్చర్యపడుతూ ఆనంద రసాస్వాదనలో మునిగి వున్న నన్ను మాశ్యాము బయటపడేశాడు.

మావాడసాధ్యుడు. కొంచెం సనాతన తత్వం గల మనిషిలా వుంటాడు. పూజ్యులన్నా, పూర్వాచారాలన్నా పూర్తిగా నమ్మకమున్నవాడు. ఏదన్నా వాదనవస్తే దుంపతెంచి గంప కెత్తుతాడు. అనా డెవ్వరూ దొరకని నాకు వాణ్ణి చూచేసరికి ప్రాణమైతే లేచివచ్చిందన్న మాటేగాని; ఏంమాట్లాడాలో తోచక తన్నుకు చస్తున్నా. వాడివి నావి వుత్తర దక్షిణ ధ్రువభావాలు. ఇలావున్న నన్ను వుద్ధరించటానికి దేవుడల్లే వస్తూన్న మా విశ్వాన్ని చూచి కొంచెం తెప్పరిల్లా. వాడేవేవో వింతలను సంతరించుకొస్తూంటాడు. వాడువచ్చి రాగానే "విన్నావురా శ్యామూ! పదునారేండ్ల బాల విధవకు మళ్లీ పెళ్లిచేస్తే పాపమూ అమ్మాయి అర్నెల్లైనా తిరక్కముందే మళ్లీ ముండమోసిందట. పునర్వివాహాలుచేస్తే పూర్వసువాసినుల సంఖ్య తగ్గుతుందనేవాళ్లు ఏంచెప్తార్రా దీనికి?" అన్నాడు ఆశ్చర్యంగా నాకేసిచూస్తూ మా విశ్వం పురాతనం అంటే పడిచచ్చేవాడు కాకపోయినా, అధునాతనం

అనంగానే అంధుడయ్యేవాడు కాడు. అసలు త్రాసులాంటి స్వభావం. ఎటు మొగ్గుంటే అటు వాల్తాడు.

“వాళ్ల మొహం! ఏమిటి వాళ్లు చెప్పేది? బాల విధవల సంఖ్య తగ్గటంకోసం రజస్వలానంతర వివాహాలు చేస్తామంటారు. అసలు ఏవయస్సులో పెళ్లిచేసినా, ఎన్ని పెళ్లిళ్లుచేసినా, వితంతువులసంఖ్య తగ్గటానికిగాని, హెచ్చటానికిగాని వివాహాలెట్లా కారణం?” అని కొంచెం ధీమాగా అన్నాడు శ్యాము.

“మరేమిటంటావ్” అన్నాను నేను కొంచెం సంకోచిస్తూ. వాణ్ణిచూస్తే నాకు కొంచెం భయం లెండి. నా నోట్లోనుంచి మాట రాగానే ‘వాళ్ల కర్మల’న్నాడు శ్యాము. ఈ ప్రశ్నకు సమాధానం నేనే పేపర్లోనూ చదివినట్లు జ్ఞాపకంలేదు. అయినా కాస్త బింకంగా ‘అదేమిటిరా? అయిన దానికీ, కానిదానికీకూడా కర్మమంటే యెలాగు?’ అని అన్నా ఏంచెప్తాడో చూద్దామని.

“కాకపోతే యేమిటంటావ్ మరి? అన్నీ ఆలోచించిచేసిన యీ సధవ విధవ మళ్లీ విధవైందంటే యేంకారణం చెప్తావ్” అని సగర్వంగా అన్నాడు శ్యాము. నాకేం కారణం కనుపించలా కాదంటానికి. గప్చిప్పుగావుండి ఆలోచిస్తున్నా. మావిశ్వం నోరుతెరచి వింటూ వూరుకున్నాడు. వాడు మాత్రం ఏంచెప్తాడు పాపం! కాస్సేపు ఆలోచిస్తే నాకు మరో మార్గం దొరికింది.

‘అది కాదోయ్! వితంతూద్వాహం విధవల సంఖ్య తగ్గటానికే కాదు చేసేది. వాళ్ల జీవితాన్ని బాగుచేయటానికీ, వాళ్ళ దుఃఖాన్ని పోగొట్టటానికి. చూడు పాపం! ఆ చిన్ని పిల్లలు నలుగురితోపాటు తిరగటానికిలేదు. నగలూ, నాజోములూ ధరించటానికి వీల్లేదు. అదేమంటే ప్రాప్తం లేదంటారు. ఎంతో ఆప్యాయంగావుండే ఆలుమగల సంసారాల్ని చూసి వాళ్ళింతో కుమిలి కుమిలి యేడ్వాల్సిందేకద. పనివున్నా, లేకపోయినా బయటకువచ్చే వాళ్ళంతా, యేదో పనిమీద యెదురుగా వచ్చిన ఆ అమ్మాయి మొహాన పట్టుకునితిట్టే తిట్లనూ, తిరస్కారాలనూ సహించాల్సిందేకదా దిగాలపడి. పెళ్ళిళ్ళల్లో, పేరంటాల్లో తోటివాళ్ళ కాళ్ళకు పసుపుపూసి, కుంకుమపెట్టి, పొరపాటున విధవలను కోటానికి అవకాశం లేనివాళ్ళకూడాపెత్తే, పెద్దముత్తైదువలా బొట్టును తుడుస్తూంటే వాళ్ళుపడే బాధలవల్ల వికసించాల్సిన వాళ్ళ మృదు హృదయ కుసుమాలు వసివాడి పోవలసినదేకద. పగలంతా వంటాపెంటాచేసి, సావిట్లో పడివుంటే, రాత్రి పదిగంటలకు పెళ్ళు పెళ్ళున పడకగదులకుపోయే తల్లిదండ్రులనుచూసి, ఎంత పరితపిస్తారో ఎవరికి తెలుస్తుంది. అనుదినము వాళ్ళ విధవత్వాన్ని జ్ఞాపకం చేసే అనేక ఘట్టాలవల్ల వాళ్ళు పడ్తూండే ఆ బాధ, ఆ దుఃఖం, ఆ విరక్తి ఆ సర్వాంతర్యామైన పరమాత్మే పాలించాలి. జాలిగలవాళ్ళే వూహించాలి. సదయ హృదయులే సహకారాన్ని ప్రసాదించాలి. వర్ణనాతీతాలైన ఆ బాధలను ఎన్నని చెప్తాను?” అని నేను చెప్తూంటే మా వాళ్ళ హృదయాలు కరిగి కన్నీరుగా కారసాగినవి. అప్పుడు మాశ్యాము కళ్ళు తుడుచుకుని “అదంతా నిజమేకాని, దానికీ వివాహానికీ లంకెవేయడం మోకాలికీ బోడితలకు ముడిపెట్టటం లాంటిది. వీటి కన్నిటికీ తల్లి తండ్రులకు తెలివిలేకపోవటం, దురాశాపాతక బుద్ధి కారణాలవుతాయి. ‘వుండొకచోట, మందొకచోట’ అన్నట్లు; ‘రోగమొకటి, మందొకటి’ అన్నట్లున్నూ వీటికి విధవా వివాహ చికిత్సవల్ల యేంలాభం?’ అని కొంచెం ఆలోచించి, “సరే. ఇంతకూ దీని సారాంశం విధవరికం రావటంగాని, పోవటంగాని కర్మబద్ధమనిన్నీ, మాతాపితరుల మూర్ఖత, ధనకాంక్షలున్నూ కారణాలుగా తేలింది. ఇప్పుడు మనమాలోచించాల్సిందిదికాదు. పునర్వివాహ తత్వం. ఇవి లేనందువల్ల వచ్చేనష్టం యేమిటీ అని!”

తర్వాత ఆకాశంకేసిచూచి “వెళ్దాం పదండి” అని నడుస్తూ చెప్పటం మొదలెట్టాడు. నేను మొదట్నే అనుకున్నాను వీడు వదలడురా బాబూ అని.

"అంతా మనమేలుకే' అన్నట్లు భగవంతునివల్ల వచ్చినాయని మనమనుకునే కష్టాలుగాని, సుఖాలుగాని వ్యర్థములయ్యేవి మాత్రం కావు. వాటివల్ల అవాంతర ప్రయోజనాలుంటూంటాయి. విపత్తులు పరానికి మూలమైన వైరాగ్యానికి కారణమవుతాయి, ఆనందములు ఐహిక జీవనానికాధారములౌతాయి. ఆ సంగతి మనం తెలుసుకోలేక పోవటానికి కారణం పాశ్చాత్యవాసనా పూరితమగు ప్రకృత నాగరీకతయే. ప్రజాభివృద్ధికోసం, వంశాభివృద్ధికోసం ఉద్దేశింపబడిన వివాహాల్ని కేవలం ఐహిక శారీరక సౌఖ్యాల కోసరమని అనుకోటం, ఆచరించటమున్నూ, ఆధ్యాత్మ భావాలకు ఆలవాలమైన మన భరత ఖండానికి ఎంత అన్యాయమో ఆలోచించిచూడు. పుట్టుతూగిట్టుతూ వుండే చెదలుమాదిరిగాక అనేక జన్మార్జిత పూర్వ పుణ్యముల మూలమున కలిగిన యీ మన మానవ జన్మలో 'మనం ఎందుకు పుట్టాం, ఏంచెయ్యాలి, సోదరమానవసేవకూ, దేశసేవకూ ఏవిధంగా వినియోగపడతాం' అని స్త్రీ పురుష భేదంలేకుండా ప్రతివ్యక్తీకూడా పర్యాలోచించాలి. అట్టి దేశ, మానవసేవలు సక్రమంగా జరగాలంటే మానవ సమాజాన్ని రెండుగా విభజించాలి. వివాహితులని, అవివాహితులని బాలురైనా నా అని కుశంకజేసేవు సుమా" అన్నాడు నవ్వుతూ.

వివాహితులు అనూచానంగావుండే ఐహికానందముల ననుభవిస్తూ, నియమానుగుణ్యంగా, నీతి కనుకూలంగా సంతానాన్నికంటూ దేశమానవసేవల కవసరమైన యువకులను తయారుచేస్తూండాలి, అతిథులనూ, అభ్యాగతులనూ ఆదరిస్తూండాలి. మతానికీ, దేశానికీ సేవచేసే సన్యాసులను, బ్రహ్మచారులను పోషిస్తూండాలి. సంసార జంజాటంలో సతమతమయ్యే వాళ్ళకు దేశమానవ సేవలు చెయ్యటానికి అవకాశం యెక్కడుంటుంది? కనుకవివాహితులు పైవిధంగా జీవనాన్ని వినియోగించాలి.

పరోపకారములు చేయటానికిగాని, మత, దేశ, మానవసేవలు చేయటానికిగాని, విజ్ఞానోపార్జనకుగాని, జ్ఞానదానానికిగాని అవసరం, అవకాశం అధికంగా వుంటుంది అవివాహితులకు. ఒకసారి వివాహంజరిగి కాలకర్మవశాత్తు భర్తలు భార్యలు గతించిపోయిన స్త్రీపురుషులు కూడా యీ తెగలోకే వస్తారు. స్త్రీజాతినంతా వుద్ధరిస్తున్నామని చెప్పే నేతిబీరకాయలలాంటి సంస్కర్తలే పసివాళ్ళ మనసులను పాడుచేస్తున్నారు. గృహస్థుల జీవనం ఒడిదుడుకులులేకుండా జరగలంటే అందుకు బాల్య వివాహాలే ముఖ్యం. అది వేరేవిషయం. మరొకసారి చెప్పుకుందాం.

మానవులకు సహజంగా ప్రేమించే స్వభావం వుంటుంది సాధారణంగా. ఆ ప్రేమ వివాహంవల్ల ఒక్క తన కుటుంబంమీదికే కేంద్రీకరింపబడుతుంది. అట్టి ప్రేమను విశ్వమానవ కళ్యాణమునకు వినియోగపరిచే సదవకాశం అవివాహితులకుగాక మరెవ్వరికుంటుంది? కాలవశాత్తు భర్తలు భార్యలు చనిపోయిన వాళ్ళకు దీని కనుకూలమైన బోధనలకు బదులుగా వాళ్ళ ప్రేమను సంకుచితపరిచే పద్ధతులను నేర్పకూడదు సంఘం. 'ఉదారచరితానాంతు వసుధైవ కుటుంబకం' అనే నీతిని ఆచరణలో పెట్టటాని కనుకూలమైన యిట్టి సదవకాశాన్ని దుర్వినియోగపరిచి, యీ క్షణిక జీవితాన్ని మళ్ళీ జంజాటంలోకి లాగచూడటం సంస్కర్తలకంత తెలివైన పని కాదు. పైన నీవు వర్ణించిన బాలవిధవల మానసికకష్టాలుగాని, వాటివల్లకలిగే భావపరంపరలకుగాని మూలబీజం.అచ్యుత శీలవృంతములగు అబలా కుసుమములనుచూసి, కామవికారానికిలోనైన కలికాలపు వాళ్లుచేసే బోధనాఫలితమే కారణమవుతుంది. పాశ్చాత్య విద్యా సంభూత వాతావరణం దానికి పోషకమవుతుంది. ఈ వాతావరణంలో పుట్టి పెరిగిన వివేక హీనులైన యువక సంస్కర్తల వెఱ్ఱివికసించటానికి హేతువౌతోందని నామతము.

దీనికి ప్రతీకారంగా ఏంచేయాలంటే, నీతికి విరుద్ధం కాని విధంగా, నియమానుగుణ్యంగా యువతీ శరణాలయాలు, విద్యాలయాలు స్థాపింపబడాలి,

వీటికి విరుద్ధములైన సంస్థలు (అనగా బాల విధవల యొక్కగాని, సంసార స్త్రీల యొక్కగాని అజ్ఞానం వల్లకలిగే ఫలితాలను ప్రోత్సాహమిచ్చేవి, పోషించేవిగాని నశించాలి. యీ పరిశ్రమ జరిగితే, అటువంటి సంస్థలేవైనావుంటే వాటంతటవేపోతాయి.

ఇంతలో నేను టైం చూశాను. సరిగ్గా పదిగంటలైంది. వాడింకా చెప్తూనే వున్నాడు.

"వీటికే ఎన్నైనా శాస్త్రోపపత్తులు చూపించవచ్చు. కాని శాస్త్రములన్నా, పురాణములన్నా నమ్మకంలేని యీ నవయుగంలో. మంచీచెడూ విమర్శ లేకుండా అవన్నీ బూటకములనీ, పక్షపాత రచనలనీ అనే యీ నవనాగరక యుగంలో వాటివల్ల విశేష ప్రయోజనముండదు. పైన నేను చెప్పిన నా భావాలను విని, నేను వట్టిశుద్ధ సనాతన సన్యాసినని మీరెవరైనా అనుకుంటే, అది మీ పిచ్చనిన్నీ, తెలివితక్కువనీ నేననుకుంటాను. పూర్వాచారమైనంత మాత్రాన మంచిదికాదనే నాగరికమ్మన్యుణ్ణి కాను, నూతన సంస్కారములన్న మాత్రాన మంచివి కావనే సనాతుణ్ణీకాను "నష్టదాయకములు కాకపోగా విశేషించి లోకోపకారకములగు పూర్వాచారాలనుకూడా ఎందుకు మార్చాలి" అని ప్రశ్నించే సరియైన సంస్కారిని. విదేశాచారాలను అనాలోచితంగా, అనవసరంగా మనదేశంలో ప్రవేశపెట్టకూడదనే సంస్కారిని. పాశ్చాత్య విద్యావ్యామోహితులకు మనదేశ, భాషాసంప్రదాయములను నేర్పమనికోరే సంస్కారిని" అని చెప్తూంటే మావాడి యీ ఆవేశాన్ని చూస్తూ విస్తుపోతున్నాడు విశ్వం. ఇహ లాభంలేదు రాబాబూ అనుకుని "నాయనా! ఇక నీ వుపన్యాసం చాలించు. మనం ప్రభువులమైతే వీటన్నిటినీ అమల్లోకి తెద్దాంలే. ఇప్పటికే నీకూ నాకూ చివాట్లు తప్పవు ఇంటి దగ్గర. పోదాంపద," అని బలవంతంగా ఆపి, నేటికి మంచి కాలక్షేపమే జరిగిందంటూ ఇళ్ళకు వెళ్ళిపోయాం.



"లంచాల నాన్న"

శ్రీ మున్నంగి రాజగోపాలాచార్యులు

"మీనాన్న లంచాలు కొడ్తున్నాడు కద రోయ్'' అన్నాడు మిత్రుడు. "మానాన్న లంచాలు పట్టినా, అదివేరే విషయం; ఆలంచాలు బాగా డబ్బు సంపాదించే ధనికుల దగ్గరనుంచి లాగుతున్నాడు. దానివల్ల సంఘానికి నష్టమేముంది? వారిదగ్గిరనుంచి ఆలా గుంజాల్సిందే" అన్నాడు శ్రీధర్. "అదే పొరబాటంటాను. ఏరూపాన్నయినా అపకారమే చేస్తున్నాడు మీనాయన; నీవింత చులకనగా ఆలోచించరాదీ విషయం. మీనాన్న వ్యాపారస్థుల దగ్గరే డబ్బుగుంజటము నిజమే కానీ, ఆధనిక వ్యాపారులు నీవు తలచేంతటి పిచ్చిపుల్లయ్యలు కారు. మీనాన్నకిచ్చే డబ్బంతా వస్తువుల ఖరీదు మీదవేసి, అమాయకపు ప్రజల మీద రుద్దుతారు. ఈభారాన్కి మూలకారకుడు మీనాన్నే'' అన్నాడు మిత్రుడు. ఆసంభాషణ తర్వాత శ్రీధర్ ఆలోచనలో మునిగాడు. అతని భావాలు సినీమారీలులాగా గిరున తిరిగి బుర్రను చరిచాయి.

మిత్రుడన్నమాట నిజమే. జీతాలు చాలనప్పుడు ధైర్యంగా పోరాడి, ఎక్కువ జీతాల కొఱకు ప్రయత్నించాలి కానీ, లంచాలు పుచ్చుకోవటము అమాయకపు ప్రజల నోళ్లుకొట్టి పొట్టపోసుకోవటమే అవుతుంది. చీడపురుగుల్లా నాన్నలాంటి వాళ్లు, బీద ప్రజలనే వృక్షాన్ని తొలిచేస్తున్నారన్నమాట. అయినా, నాన్న పుచ్చుకొనే లంచం సంగతివేరు. ఈరోజులలో, పేదల నోళ్లు కొట్టి ధనికులు వ్యాపారరూపేణ సొమ్ము అధికంగా కూడేస్తూన్నారు. ఎట్లయినా సరే లంచంరూపేణ అయినా ఆసొమ్ముని వాళ్ల నుంచి ఆలా లాగాల్సిందే. "గ్రుడ్డిలో మెల్ల మేలు'' అన్నట్లు, అన్యాయాన్ని అరికట్టాలంటే అన్యాయ పద్ధతితోనే అరికట్టాలి. మన ఉద్దేశ్యం అన్యాయాన్ని రూపుమాపడమేగా? ఆడబ్బు నాన్నదగ్గరున్నా దానం... ధర్మం... చేయటంలో సద్వినియోగమే అవుతుంది కదా?...

"నాన్న...దప్పి...బాధ" అని చెల్లాయి మూలుగుతూంది. "అబ్బాయీ! అమ్మాయి చాల క్లిష్టస్థితిలో వుంది. త్వరగా, డాక్టర్ని పిలుచుకొనిరా' అనిన

తల్లిమాటలు, తన ఆలోచనలకు అడ్డు వచ్చాయి. ఈగొడవల్లో చెల్లాయి సంగతి మఱచి ప్రమత్తుడై ఇతర ఆలోచనల్లో దూరి, కాలయాపన మైనందులకు మదన పడ్డాడు. తాను ఉన్నాడని పట్నంలో అన్నీ అందుబాటులో వుంటాయని, చెల్లిని పల్లెటూరునుంచి తన దగ్గరికి తల్లిపిలుచుకొని వచ్చింది. తానూ, చదువుమానేసి, చెల్లెల్ని కనురెప్పలాగా కాపాడుతున్నాడు. అయింటిలో ఆ అమ్మాయి ఒకత్తే కాబట్టి అతి గారాబంగా పెరిగింది. అందరికీ ఆమె అంటే అమిత ప్రేమానూ.

మిత్రునితో మాట్లాడటం కట్టిపెట్టేసి, డాక్టరింటికి పరుగెత్తాడు శ్రీధర్. చెల్లెల్ని పరీక్షించాడు డాక్టర్. "తీవ్రమైన జ్వరం. ప్రాణము నీరసించి పోయింది. ఇప్పుడు మీరు పాలు ఇచ్చినా ఇముడ్చుకొనే స్థితిలేని రకంలోవుంది. 'గ్లూకోస్' నీళ్లు తప్ప, ఈ అమ్మాయికి ఆధారం కన్పించదు. దాన్ని ఈమె తెలివికి వచ్చినప్పుడెల్లా, పట్టడం మంచిది" అని అన్నాడు డాక్టరు.

చెల్లాయిని ఏల్లాగైనా బ్రతికించుకోవాలి. తక్షణం బయల్దేరాడు శ్రీధర్, గ్లూకోస్ కొనుక్కొరావటానికి. బజారంతా గాలించినా దొరకలేదు. వట్టిచేతుల్తో ఇంటిమొగం పట్టాడు. "అమ్మా! ఎక్కడికెళ్లినా గ్లూకోస్ దొరకలేదు" అన్నాడు. "డాక్టరుగారు దొరుకుతుందన్నారే" అంది తల్లి. "ప్రతిదుకాణాదారు, లేదు అనే అంటూన్నాడు. పోనీ ఎంతయిన సరే చాటుగానైనా ఇచ్చికొనుక్కోనిరానాయినా" అంది. "ఎంత ఇస్తానన్నా నన్ను నమ్మేవాడేడి? అదొంగవ్యాపారమైనా వాళ్లకి, తెలిసిన వాళ్లతోనేగానీ చెయ్యరుగా..." అన్నాడు. "మన ఊళ్లో అయితే, దొరికేది. మీనాన్నయితే, ఎల్లాగైనా పట్టుకొచ్చేవాడు." అంది తల్లి. "ఆమాటనిజమే. కానీ ఇక్కడ మన ముఖం చూచేవాడెవడు? అయినా మన కొక్కరికి దొరకితే, చాలా? మనలాంటి వాళ్లెందరు ప్రాణాంతకావస్థ నొందుతున్నారో!" అన్నాడు శ్రీధర్.

చెల్లెలిస్థితి చాల ప్రమాదంగావుంది. సంధిగుణాలు కూడా, కనిపిస్తున్నాయి, కానీ చెల్లెల్ని బ్రతికించుకోవాలి. చివరి ప్రయత్నం చేద్దామని తిరిగి బయల్దేరాడు శ్రీధర్. నాన్న ఉంటే సులభంగా దొరికేదేమోనని పించింది. అయినా నాన్నని మాత్రం ఈపట్నంలో లెక్కపెట్టేదెవరు? ఆ ఊళ్లో గనుక అతని వుద్యోగానికి జడిసి, ఆదొంగ వ్యాపారులు నాన్నకేది కావాలన్నా ఇస్తూన్నారు. కానీ ఈ ఊళ్లో ఆయన్ని లెక్క చేయరుగా? ఇల్లా ఎందరు బాధ పడుతున్నారో?

ప్రొద్దున్న మిత్రుడన్నట్లు వ్యాపారుల దురాశ, ఉద్యోగుల లంచగొండితనమే, ప్రజలకు, అత్యావసరపు వస్తువులు దొరక

నివ్వక, నానావస్థలు పెట్టూంది. ఎందరికి అవసరమైన వస్తువులు దొరకక ప్రాణాలు పోతున్నాయో. హృదయంలేని వీళ్లకేం పట్టింది? డబ్బువుండీ చెల్లెలి బాధను తాను తగ్గించలేక పోతున్నాడు. ఇక డబ్బులేని వాళ్లసంగతో??? తన చెల్లెలు బాధపడితే ఆహృదయ విహీనులకేం, వాళ్లకు లాభాలు కావాలిగానీ? మిత్రుడన్నట్లు ఈలంచ గొండులు, దొంగ వ్యాపారస్థులు, ప్రజల మానప్రాణముల కొల్లగొట్టుతున్నారు,వాళ్ల రక్తమాంసాలు పంపకాలేసుకొంటూ న్నారు. "గ్లూకోస్" దొరకనివ్వక ఆదొంగ వ్యాపారులు, లంచగొండ్లూ, తన చెల్లి రక్తాన్ని పీలుస్తున్నారు. అటు దొంగ వ్యాపారస్థులు, ఇటు లంచగొండ్లూ, ఇద్దరు తన చెల్లెలి రక్తాన్ని పంచుకొంటున్నారు. వాళ్లూ వీళ్లూ రాక్షసులే. నాన్న పొరబాటే చేస్తున్నాడు. ఆయన తీసుకొనే లంచం, ఎందరి రక్తమై వుంటుందో, అందులో తన చెల్లెలిరక్తంకూడా ఎందుకుండ కూడదూ?

ఆరాక్షస వర్గంలోవున్న తండ్రి కూడా తన చెల్లెలి రక్తాన్ని జుర్రుతూన్నాడన్న మాట, ఛీ...ఛీ...ఆలాంటి మనిషి నాన్న కాడు. అడవిమృగాలైన తమజాతి జంతువుని తినటానికి, సాహసించవు, కానీ ఈక్రూరులో, తమ జాతిరక్తాన్నే ఆప్యాయ మానంగా త్రాగుతూన్నారు. జుర్రుతూ న్నారు. ఈలా, చెల్లెలిమీది మమతతో తికమిక పడ్తూ, తిరిగి కాళీచేతులతో ఇంటి ముందు కొచ్చేసరికి, ఇంటి ముందు జనం మూగి వుండటం చూచాడు. అప్పుడే రైలు నుంచి వచ్చిన తండ్రి ముఖాన గుడ్డపెట్టు కొని, ఒకచోట ఉన్నాడు "నాయనా! పోయరో... బంగారు తల్లీ పోయరో... నాచిట్టితల్లీ రాదుకో...!" అని ఒకటే తల్లిరోదన.

శ్రీధర్ సంగతి గ్రహించాడు. గుండె నీరైంది. దుఃఖాతిశయంచేత కళ్లంట నీళ్లు రాలేదు. నెత్తి నోరూ కొట్టు కొంటూన్న తల్లివైపు, గుడ్లప్పగించి చూస్తూన్నాడు. 'ఏడ్వకమ్మా ఏడ్వకు నీకూ ఆమెకు ఋణం తీరింది. ఆ అమ్మాయి ఆయుస్సు అంతే వుండగా మనమేంచేస్తాం?" అంటూ అమ్మని ఎవరో ఓదారుస్తున్నారు. ఆమాటలు శ్రీధర్ భరించలేకపోయాడు. దుఃఖం, క్రోధం అతన్ని ఆవహించాయి. "ఆబిడ్డకు ఆయువు లేక చావలేదు. అదుగో! ఆరాక్షసులు, దొంగవ్యాపారులు, లంచగొండ్లు దాని ప్రాణం తీశారు. నాచెల్లెలి రక్తం త్రాగేరు" అని నాన్నను చూచి "నాన్నా! నీవూ చెల్లెల్ని చంపిన వారిలో ఒక డివే. నీవు దానిప్రాణం తిన్నావ్. నేనిక మీలో వుండలేను" అని, బావురుమంటూ ఏడుస్తూ, బయటికి పోబోయి గడపకి గ్రుద్దు కొని స్పృహతప్పికింద పడ్డాడు.

తెలివి వచ్చేసరికి హాస్పటల్లో వున్నాడు. ప్రక్కన, తల్లీ, తండ్రి వుండటం చూచేడు. "నేను, మీలో వుండలేను.

మీరు ఘోర హింసా రాక్షసులు, లంచ గొండులను, దొంగవ్యాపారులను, చంపేసి, నా చెల్లెలి చావుకు పగతీర్చుకొంటా'' అని శ్రీధర్ గొణగ నారంభించాడు. ఎవరో "ఇంకా పైత్యపు మాటలు వదల్లేదు'' అనటం విన్నాడు.

"నేనా... పిచ్చా .. పైత్యమా... బుద్ధి లేదు ఆమాట అన్నవాళ్లకి, వారికే తిక్క పైత్యం, అన్నిని. మునుపటి, శ్రీధర్, చెల్లెలితోపాటు ఎప్పుడో చచ్చిపోయాడు. ఈ శ్రీధర్ క్రొత్తగా పుట్టేడు. మనుష్యుల్ని తినే మనుష్యుల్ని మ్రింగటానికే, ఈ శ్రీధర్ పుట్టాడు.'' అంటూ, మళ్లీ స్పృహ తప్పేడు శ్రీధర్. అందరూ అవింత ధోరణి అర్థం చేసుకోలేక ఆశ్చర్యపోయారు. ప్రపంచానికి ఏం తెలుసాతని విషయం. నిజ మెరిగిన వారికి తప్ప !



రాజాప్రొడక్షన్స్‌వారి "పుట్టిల్లు" లో
నొక మనోహర దృశ్యము.

రష్యాలో పశుపోషణ

శ్రీ ఎ. ఫ్యొడొరోవ్

రష్యా చిరకాలంనుండీ పశుసంపదకు ప్రసిద్ధి పొందినదేశం.

సుమారు రెండు శతాబ్దాల క్రితం 1774 లో ఒరెనెజ్ రాష్ట్రంలోని బాబ్రోవ్ జిల్లాలోగల ఖరెనోవొయె గ్రామంలో అర్లోవ్ పశుగణాభివృద్ధి క్షేత్రాన్ని నెలకొల్పేడు. ఈక్షేత్రంలోనే వాసిలీషిష్కిన్ అనే రైతు ప్రపంచ ప్రసిద్ధి పొందిన అర్లోవ్ జాతి గుర్రాలను పెంచేడు. ఈజాతిగుర్రాలు చాల పెద్దవి; గొప్ప వేగంతో పరుగెత్తగలవు. దేశంలో గుర్రాలు పెంపకంమీద అర్లోవ్ జాతి గుర్రాల ప్రభావం బాగా పడింది. దక్షిణానున్న పచ్చికబయళ్లలో ప్రసిద్ధ డాన్‌జాతి గుర్రాల పెంపకం జరిగేది. తుర్కమేనియాలో అఖల్ టెక్ జాతి గుర్రాలు పెరిగేవి; యీజాతి మధ్య ఆసియా ఎడారుల శీతోష్ణ స్థితికి బాగా అలవాటు పడింది.

దేశానికి దూరంగా వుత్తరాన్నగల ప్రజలు అనేక శతాబ్దాలనుండి మంచి రకం కుక్కలను పెంచుతున్నారు; వారు పెంచే జాతులకు సమానమైనవి ఎక్కడా కనబడవు. చాలకాలం క్రిందటనే రష్యాలో రెయిన్‌డీర్ పెంపకం బాగా పెంపొందింది. అతిత్వరగా పరిగెత్తగల యీరేయిన్‌డీర్ (ఉత్తర ధృవాన పెరిగే ఒకజాతి దుప్పి) మందలుగా విదేశాలకు ఎగుమతి అయేవి. ఇదంతా కూడా పాతరష్యాలో అతివిలువైన పశుగణాన్ని పెంచే పశుపోషకుల అపారమైన అనుభవానికి ప్రబల సాక్ష్యం.

ప్రఖ్యాత రష్యన్ శాస్త్రజ్ఞుడైన పావెల్ కులెషోవ్, పశువులలో అధునిక జాతులన్నీ ప్రధానంగా, వివిధ ప్రజలు అనేకవేల సంవత్సరాలక్రితం పెంచి పోషించిన యితర జాతులనుండే వుద్భవించేయని తన పరిశోధనల్లో రుజువు చేశాడు. ఆవిధంగా పశుగణాభివృద్ధిలో బ్రిటిష్ వారిదే అగ్రతాంబూలమనే బూటకపు వాదాన్ని పటాపంచలు చేశాడు.

పావెల్ కులెషోవ్ (1854-1936,) నికొలై చిర్విన్‌స్కీ (1848-1920,) వీరిద్దరూ రష్యన్ పశువిజ్ఞానశాస్త్ర పితామహులు.

ఎన్. చిర్విన్‌స్కీకి పశువుల ఆహారానికి సంబంధించిన శాస్త్రీయ సూత్రాలపట్ల శ్రద్ధ ఎక్కువ. శాస్త్రీయపద్ధతి ఆహారం పెట్టడం పశుగణాభివృద్ధికి అత్యవసరమని అతను రుజువు చేశాడు. జంతు ప్రాణిలో కొవ్వు పెరగడం మీద పరిశోధన ప్రారంభించేడు.

ఆకాలంలో జర్మన్ శాస్త్రజ్ఞుడైన ఫాయిట్ సిద్ధాంతాలు బాగా ప్రచారంలో వుండేవి. జంతువులో కొవ్వు పెరగడానికి కార్బొహైడ్రేట్స్‌తో ఏవిధమైన సంబంధమూ లేదనీ, కొవ్వువల్లగాని, పశువుల ఆహారంలో వుండే మాంసకృత్తుల (ప్రొటీన్స్) వల్లగాని కొవ్వు తయారవుతుందనీ ఫాయిట్ సిద్ధాంతీకరించాడు.

ఈముఖ్య విషయంలోని నిజానిజాలను పరీక్ష చేయడానికి ఎన్. చిర్విన్‌స్కీ యీదిగువ పరిశోధన చేశాడు; అతను ఒక గ్రూపు జంతువులను బార్లీ ఆహారం పెట్టి పెంచాడు; మరొక అటువంటి గ్రూపు జంతువులనే బార్లీతో పిండిపదార్థం, పంచదార కలిపి పెట్టి పెంచాడు. మొదటిగ్రూపు జంతువులలో పెరిగినకొవ్వు నూటికి 61. 6 పాళ్లు, రెండో గ్రూపులో పెరిగిన కొవ్వు నూటికి 76. 9 పాళ్లూ వుంది. పిండిపదార్థం, పంచదారలు కేవలం కార్బొహైడ్రేట్స్ కావడంవల్ల యీ పరిశోధన ఫాయిట్ సిద్ధాంతం సరియైనది కాదని స్పష్టంగా రుజువు చేసింది. ఈవిధంగా కొవ్వు పెరగడానికిగల కారణాలమీద చిర్విన్‌స్కీ చేసిన పరిశోధనలు పశుఆహార శాస్త్రవిజ్ఞానానికి శాస్త్రీయ పునాదులను ఏర్పరిచేయి. ఈపరిశోధన తరువాత చిర్విన్‌స్కీ, జంతువులప్రాణి పెరుగుదలమీద 30 సంవత్సరాల కాలం పరిశోధనలు చేసేడు

(1) "శీతోష్ణస్థితి (2) జంతువు పెరిగే దశలో ఆహారపరిస్థితులు (3) అవయవాల సంచలనం గాని చలనం లేకపోవడం గాని" - యీ నాలుగూ జంతువులలో మార్పులు తెచ్చిపెట్టేవాటిలో ముఖ్యమైనవి. జంతువుమీద శీతోష్ణస్థితి ప్రభావం ఒకప్రదేశంలో మార్పుచెందకుండా ఒక్కలాగే వుంటుంది; మానవ ప్రయత్నంవల్ల అది మార్పుచెందదు. ఆర్థిక దృష్ట్యా లాభకరమైన మార్పులను జంతువులలో తీసుకు రావడానికి మానవుడు చేసే ప్రయత్నాలు అప్పుడప్పుడు సఫలం కావడంగాని, విఫలం కావడం గాని జరుగుతుంది."

వివిధ ఆహార పరిస్థితులలో జంతువులలో వచ్చే మార్పుల గురించి చిర్విన్‌స్కీ విపులంగా వ్రాశాడు;

"ఆహార పరిస్థితులను మార్చడం వల్లనూ, కొన్ని అవయవాలను చలింపజెయ్యడం వల్లగాని, చలింప జెయ్యక పోవడంవల్లగాని జంతువులలో మార్పులు కలిగించడం సాధ్యమవుతుంది. దీనివల్ల జంతువుచేసే మామూలు పనులు బాగా చెయ్యవచ్చును; లేదా చెయ్యలేకపోవచ్చును, అది తానుతిన్న ఆహారానికి ప్రతిఫలం యివ్వవచ్చును; యివ్వకపోవచ్చును," అని ఆయన వ్రాశాడు.

ఎన్. చిర్విన్‌స్కీ పరిశోధనలబట్టీ, సిద్ధాంతాలబట్టీ అతను తన కాలాన్ని దాటి ఎంతో పురోగమించేడని తెలుస్తూంది. ఈ ప్రఖ్యాత రష్యన్ శాస్త్ర విజ్ఞాన వేత్త చేసిన సిద్ధాంతాలు ప్రపంచ జంతు శాస్త్ర విజ్ఞానాభివృద్ధికి ఎంతో తోడ్పడ్డాయి.

* * *

శతాబ్దాల కాలంలో అనేక కొత్త జాతులు మెల్లి మెల్లిగా అవతరించేయి. వేలకొద్దీ సంవత్సరాల కాలంలో మానవుడు వెన్నెముకగల మొత్తం 70,000 జంతుజాతులలో 60 జాతులను మాత్రమే మచ్చిక చేసి పెంచకలిగేడు.

ప్రఖ్యాత జీవశాస్త్రజ్ఞుడు ఇవాన్ మిచురిన్ ప్రకృతిని పాలించే కొత్త నియమాలను కనుగొన్నాడు. "మానవుడు జోక్యం కలిగించుకుంటే ప్రతిజంతువుగాని, మొక్కగాని త్వరగా మారిపోవడం సుసాధ్యమవుతుంది; అంతేకాదు, మానవుడు కోరిన విధంగా మారిపోతుంది. మానవుడు సాధించడానికి కావలసినంత పనివుంది" అని ఆయన వ్రాశాడు.

ఆనాడు, అకెడెమిషియన్ మిఖేయిల్ ఇవనోవ్ అతిస్వల్ప కాలంలో కొత్తరకాల జంతువులను సృష్టించి పెంచేవాడు. నివాసంలోనూ, బంధుత్వంలోనూ ఒకదాని కొకటి అతిదూరంగా వున్న జాతులను జతకట్టించే పద్ధతిని అతను చేపట్టేడు. అతను అడవి మఫ్లాన్‌ను స్థానికంగా పెరిగిన గొర్రెతో జతకట్టించగా పుట్టిన జాతీ తల్లియొక్క తెల్లటి మెత్తటి రోమాన్నీ, కొండలలో పెరిగిన తండ్రి ధారుఢ్యాన్నీ పొందింది. అకెడెమీషియన్ ఇవనోవ్ పెంచిన జాతిగొర్రె ఒక్కటి ఏడాదికి 22.4 కిలోగ్రాముల వున్నినిస్తుంది. ఈగొర్రె బరువు సుమారు 174.5 కిలోగ్రాముల వరకూ వుంటుంది. అది అతి చురుకుగా పెరుగుతుంది. అంత అత్యధిక వుత్పత్తి శక్తిగల మెరినో గొర్రెలవంటివి చరిత్రలో కానరావు.

సోవియట్ పరిపాలనా కాలంలో పశుపోషకులు అనేక కొత్తజాతుల పశువులను, గుర్రాలను, గొర్రెలను సృష్టించి పెంచేరు.


ఇండియన్ జాబూతో రెడ్‌స్టెప్పీ పశువులను జతకట్టించగా అత్యధికంగా పాలిచ్చే, రోగాలను తట్టుకో గలిగే కొత్తజాతి పశువులు పుట్టేయి. జీబ్రానూ గుర్రాన్నీ జతకట్టించగా మంచిబలమైన జంతువు పుట్టింది. యాక్‌నూ ఆవునూ జతకట్టించగా ఎక్కువగా పాలిచ్చే పశువులు పుట్టేయి.

ప్రఖ్యాత సోవియట్ పశువిజ్ఞాన శాస్త్రజ్ఞుడు ఎస్. ష్టెయిమన్ అతి స్వల్పకాలంలో కోస్ట్రొమా జాతి ఆవులను పుట్టించేడు; ఇవిచాల ఎక్కువగా పాలిస్తాయి. కోస్ట్రొమా ఆవు ఏడాదికి 5 నుండి 6 వేల లీటర్ల పాలిస్తుంది.

పశుగణాభివృద్ధిలో కృత్రిమ బీజారోపణ పద్ధతికి చాల ప్రాధాన్యత వుంది. దీనిని మొట్టమొదట 1856 లో రష్యన్ జీవశాస్త్రజ్ఞుడు వ్లాడిమిర్ వ్రాస్కీ ప్రయోగించేడు. అతను చేపలు గుడ్లు పెట్టే తొట్టినొకదానిని నిర్మించాడు. ఈతొట్టిలో, ప్రపంచంలో మొట్టమొదటి సారిగా డ్రైఫెర్టిలైజేషన్ పద్ధతిని చేపలను పుట్టించడం ప్రారంభించేడు. ఈపద్ధతి ప్రకారం చేపగుడ్లు ఒక పొడి గిన్నెలోకి వదిలివేయబడతాయి; యింకొక పొడి గిన్నెలో మిల్ట్‌ను సేకరించి, దానిలో నీరుకలిపి గుడ్లమీద పోయడం జరుగుతుంది. ఈపద్ధతివల్ల గుడ్లన్నీ పరిపక్వంచెంది పిల్లలు బయటపడతాయి. వ్రాస్కీ కనిపెట్టిన పద్ధతికి "రష్యన్ పద్ధతి" అనిపేరు; ఇది ప్రపంచమంతటా ప్రయోగింప బడుతూంది.

పశువులలో కృత్రిమ బీజారోపణ పద్ధతిని జారిస్టు రష్యాలో మొట్టమొదట మాస్కో విశ్వవిద్యాలయానికి చెందిన ప్రొఫెసర్ ఇల్యా ఇవనోవ్ కనిపెట్టేడు. కాని అభివృద్ధి నిరోధకులు యీపద్ధతి అమలు జరుగకుండా ప్రతిఘటించేరు. సోవియట్ పరిపాలనలోనే ఇవనోవ్ పద్ధతి గుర్తింప బడింది. ఈనాడు సోవియట్ దేశంలో యీపద్ధతి లక్షలాది గొర్రెలమీద, పశువులమీద ప్రయోగింప బడుతూంది. పశుగణాభివృద్ధికీ, పశుజాతులను పెంపొందించడానికీ యీపద్ధతి ఎన్నో అవకాశాలను కలిగించింది. అది తక్కువ మొగజాతి పశువులతో అధికంగా మంచిజాతి పశువులను సృష్టిస్తుంది.

సోవియట్ దేశంలో వ్యవసాయానికీ, పశుగణానికీ సంబంధించిన శాఖలన్నీ బాగా అభివృద్ధి పొందేయి. సమిష్టివ్యవసాయ క్షేత్రాలలోనూ, ప్రభుత్వక్షేత్రాలలోనూ, పనిచేసే రైతులు శాస్త్రజ్ఞులకు తోడ్పడుతున్నారు. అంతేకాదు, గ్రామాలలో కొత్తజాతుల పశువులను సృష్టించి, పెంచుతూన్న పశుపోషకులూ, రైతుల అనుభవజ్ఞానం వల్ల శాస్త్రవిజ్ఞానం అభివృద్ధి పొందుతూందికూడాను.



ఆవాలపొడి నీళ్లలో కలిపి నొప్పియున్న చోట పట్టువేస్తే వాతనొప్పి పక్షవాతము నివృత్తియగును. మిరియాల చూర్ణానికి తేనె కలిపివాడినను, బెల్లంపాకుతో మాత్రలు చేసి వాడినను దగ్గులు, పగుళ్లు, గొంతు నసలు నయమవుతవి. కొంచెం పగుల గొట్టిన మిరియాల్ని నేతిలో వేయించి ఆ మిరియాలు నెయ్యి మొదటి ముద్దలో కలుపుకొని తింటే నీళ్లవిరేచనాలు కడ్తవి.

మెంతుల పట్టు కీళ్లనొప్పులను త్వరగా తగ్గిస్తుంది. ధనియాలరసం, తేనె, పంచదార కలిపిన పానకము దాహానికి మంచిది. మిరియాలు మంగలంలో మాడ్చి నీళ్ళుపోసి ఆనీళ్ళు కలరారోగికి వాడ్తే జబ్బు తిరుగుమొహం పెడ్తుంది. కాకకు, తలనొప్పికి ధనియాల పట్టుమంచిది. రక్తగ్రహణి మెంతులు వెన్నకలిపి తింటే కట్టుంది.

ఆకుల దేవకీదేవి

ఆవునెయ్యి, పంచదార, ఉత్తరేణి, సోపు, లేహ్యపాకముగా తయారుచేసి సేవించినచో స్త్రీల శ్వేతప్రదరములు, యితర యోనిరోగములు తగ్గిపోవును.

పిప్పళ్లు, మిరియములు, శొంఠి చూర్ణించి తేనెలోకలిపి పూసినచో నోటిపూత తగ్గును.

అక్కలకర్ర కషాయము కాచి సేవించినచో గొంతునొప్పి తగ్గును.

వాతవ్యాధులకు శొంఠి, మిరియాలు, సైంధవ లవణము, యవక్షారము చూర్ణములుచేసి పూటకు ¼ తులం తేనెతో సేవించినచో వాతవ్యాధులు నిర్మూలించును.

తాడికాయ చూర్ణమును మంచి తేనెతో కలిపి సేవించినచో వెక్కిళ్లు తగ్గును.

పెసరకషాయమును సైంధవ లవణముతో కలిపి సేవించిన వాంతులు నివారణమగును.

పేదరైతు:

రాజరాజేశ్వరీవారి [illegible] చిత్రం, నిర్మాణంలో తయారైంది. డిసెంబరు నెలలో విడుదలవుతుంది. దర్శకుడు కడారు నాగభూషణంగారు. ఇందులో అంజలీదేవి, కన్నాంబ, శ్రీరామమూర్తి మొదలగు ప్రసిద్ధ తారాగణం పాల్గొన్నది.

* * *

పుట్టిల్లు:

రాజశ్రీ ప్రొడక్షన్సు వారి నిర్మాణం, డాక్టరు రాజారావుగారు దర్శకత్వంలో ఈ చిత్రం తయారు చేయడానికి తీవ్రంగా కృషి చేస్తున్నారు.

ఇందులో స్త్రీ జాతికి ప్రాధాన్యమిస్తూ మహిళా సంఘములకు సంబంధించిన ప్రధాన సమస్యల పరిష్కార మార్గాలను ప్రదర్శిస్తున్నారని వార్తలు.

మహిళా జాగృతిని గూర్చి ఈ శతాబ్దంలో తయారవుతున్న యీ చిత్రం విజయవంతంగా తయారవుతుందని ఆశిస్తాము. నిర్మాత, దర్శకుడు, హీరో డాక్టర్ రాజారావుగారు. హీరోయిన్ శ్రీ టి. జమున చేస్తారు. సత్యన్ మరికొందరితో [illegible] చురుకుగా సాగుతున్నది.

* * *

[illegible]:

అజంతావారి చిత్రం, ఇందులో ముఖ్యపాత్రలు, వి. యస్. ఆర్, నాగేశ్వరరావు మొదలగు వారు నటించారు. త్వరలో విడుదలకు సిద్ధముగా నున్నది.

* * *

రాజశ్రీ ప్రొడక్షన్స్ వారి
"పుట్టిల్లు" లో ఒక సన్నివేశం

ఆశీర్వాదం

[illegible] శ్రీ [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible]

* * *

[illegible]

[illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] నటిస్తున్నారు.

* * *

[illegible]

[illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible]

* * *

''[illegible]'' [illegible] [illegible] [illegible] [illegible]

చంద్రహారం

[illegible] [illegible] చిత్రంలో [illegible] శ్రీ రంజని నాయకీ [illegible] [illegible] చిత్రం [illegible] [illegible] దర్శకుడు శ్రీ కె. కామేశ్వరరావుగారు.

[illegible] * * *

[illegible] [illegible] [illegible] [illegible] చిత్రం [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible]

[illegible]

శ్రీ [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] నటిస్తున్నారు.

* * *

[illegible]

[illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible]

* * *

[illegible]

[illegible] చిత్రం [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] నటిస్తున్నారు.

* * *

[illegible]

[illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible]

— అమరవాణి —

అనువాదము:

"కృష్ణ"

రాకుమారుడు మన్సిల్ మహా గాయకుడు. అతను ఫిడేలు (వైయోలిన్) బాగా వాయించ గలడని ఊళ్లో అందరు చెప్పుకునేవారు. మన్సిల్ కు మాత్రం, తనను మించిన గాయకుడు లేడని, పేరు పొందాలని మహా కుతూహలం- ఆశాను. కానీ తీరని కోరిక ఒకటి కలదు మన్సిల్ కి. తన చిత్తం వచ్చినట్లు పలికే వయోలిన్ కావాలని. విదేశాలనుండి, ఏడు సముద్రాలవతల నుంచి ఎన్ని ఫిడేళ్లు తెప్పించినను, మన్సిల్ నకు అవేవీ నచ్చలేదు.

ఒకనాడు విచారంగా భవనమందు కూర్చునివున్న మన్సిల్ నకు తియ్యని పాట వినవచ్చినది. ఆశతో ఆనందముతో ఆ అమర గానము వినవచ్చు దిక్కునకు పరుగెత్తుకొని వెళ్లి చూచాడు మన్సిల్. ఒక బిక్షుకుడు ఒక ఫిడేలుమీద ఏవో కూనిరాగాలు వాయిస్తున్నాడు. మన్సిల్ నకు ఆఫిడేలు తన ఆశలను తీర్చగలదనే నమ్మకము కలిగి "అబ్బీ! నీకు ఏం కావాలన్నా యిస్తాను. నాకు నీఫిడేలు ఇస్తావా?" అని గంపెడు ఆశతో అడిగాడు.


"అలాగే బాబూ, కాని, నేను దీనికి డబ్బు పుచ్చుకోను. నాకు వేరే ఫిడేలు యిస్తే, తమరికి దీనిని యిచ్చిపోతాను" అని జవాబిచ్చాడు. బిక్షుగానికి వేరే ఫిడేలు బదులిచ్చి మన్సిల్ అతని ఫిడేలును ఆనందంతో పుచ్చుకొని అతనిని పంపివేసినాడు. ఇక అపరిమిత ఆనందము, ఆత్రము పట్టలేక, ఒకచోట ఏకాంతముగా కూర్చుని ఫిడేలు వాయించడం మొదలెట్టాడు మన్సిల్, ఏదో హాయి గొలిపే రాగం తనకు ఇష్టం వచ్చినట్లు. చటాలున మెరుపు మెరిసింది తన కళ్లెదుట. అద్భుతమైన వెండినిచ్చెన, దానిమీద ముద్దులొలికే చక్కని దేవకన్య ఎక్కుతున్న దృశ్యం కళ్లకంటింది మన్సిల్ నకు. తను అదేరాగము మరీ మరీ వాయించసాగాడు. ఆదేవి యింకా యింకా పైకెక్కుతున్నది. ఒకపువ్వులాంటి మేఘాన్ని సమీపించింది. చటుక్కున పాట ఆపాడు మన్సిల్. ఒక్క పొలికేక వేసింది ఆకన్య. అంతే, ఆనిచ్చెన, ఆమేఘం, ఆ కన్య అదృశ్యమైనారు.

ఆ అమ్మాయిని తిరిగి చూడకోరిక కలిగి మన్సిల్ మళ్లీ అదేరాగం వాయించాడు. తిరిగి అదే దృశ్యం కనబడింది అతనికి. "దేవీ! ఈదృశ్యానికి అర్థమేమిటి తల్లీ?" అని అడిగాడు. "బాబూ! నేనొక దేవతా కన్యను. అదుగో కనబడలేదూ మేఘం అదే మావూరు, మా ఇల్లు, మా అన్నీనూ.

నేను అక్కడ వుండేదాన్ని. నేను మంచి పాటకత్తెనని నాకు మహా గర్వంగా నుండేది. ఒకనాడు మారాణిగారి సభలో నేను ఒక పాట పాడినాను. అందరు బాగున్నదనగా, ఆపాటను నేనే కల్పించుకున్నాను, నాలాటి పాటకత్తె మరెవరు ఉండబోరు అని చాలా గర్వించినందులకు మారాణీనన్ను శపించింది. 'నీగర్వం అణిగేట్లు నువ్వు, నీ ఈపాట నీచెవులలో పూర్తిమ్రోగేటట్లు, ఒక ఫిడేలులో బంధింపబడి యుంటావు. ఎప్పుడైతే 'మన్సిల్' అనే రాకొమారుడు నీ ఈపాట ఆఖరు వరకు ఈఫిడేలులో వాయిస్తాడో, అప్పుడు నీకు ముక్తి కలుగుతుంది' అని- అందుకే నీకు పుణ్యం వుంటుంది బాబూ! నన్ను వదిలిపెట్టు'' అని దేవి బ్రతిమాలింది. ''నీవుపోతే, నాపాటకు ఈ మధురత్వం వుంటుందా'' అని అడిగాడు మన్సిల్. ''వుండదు. నాతోనే ఆపాట మాధుర్యం నశిస్తుంది'' అంది దేవి.

అప్పటినుంచి మనసులో అదోదిగులు పట్టది మన్సిల్‌కి, తనుగాని ఆపాట పూర్తిగా వాయిస్తే దేవి మాయమవుతుందేమోనని, అందుకని ఎప్పుడు ఆ పాట పూర్తిగా వాయించేవాడుకాదు. ఈ పాట వలన వూరిలో తనకు కోరినంత పేరు ప్రఖ్యాతులు సిద్ధించినవి. ఒకరోజు రాజుగారు వచ్చి మన్సిల్‌తో ''నాయనా! నేను పెద్ద సభ ఏర్పాటు చేస్తాను. నీవుఫిడేలు వాయించి, నీప్రవీణతను చూపించి, అందరి ఎదుట నాకు తగిన కుమారుడనిపించుకో తండ్రీ'' అని అన్నాడు. ఆరాత్రి మన్సిల్ దేవిని పిలచాడు. దేవి అంది. ''నీకుపుణ్యముంటుంది. నీవుగాని రేపుసభలో నన్ను విముక్తురాలిని చేస్తే నీకు అమరకీర్తిని చేకూరుస్తా'' నని వాగ్దానం చేసింది.

మర్నాడు రాజుగారు సభ చేర్చారు. మన్సిల్ వచ్చి కూర్చున్నాడు. ఫిడేలు తీశాడు. ఒక్కొక్కటే వాయించాడు. ''చాలా బాగుంది'' ... ''ఇంకా బాగా వాయించగలడేమో'' అని అననివారు లేరు సభలో. పాటపాటకి యివే మాటలు. ఆఖరున దేవీపాట మొదలెట్టాడు. అందరు నిశ్శబ్దంగా ఏకదీక్షతో వింటున్నారు. దేవి నిచ్చెన, మేఘం అంతా తన కంటికగబడుతునే వున్నవి. స్వర స్వరానికి, అనిచ్చెన మెట్లు ఎక్కి దేవి తననుండి దూరమై పోతున్నదన్న దుఃఖం ముంచుకొని వస్తున్నది మన్సిల్‌నకు ఆఖరిమెట్టూ ఎక్కింది దేవి; ''రా మన్సిల్''అని పిలిచినట్లైంది మన్సిల్‌కి. ఫిడేలు నేల పడేసి, తనూ తన దేవితో నిచ్చెనెక్కి వెళ్ళిపోయినట్లు అనిపించింది మన్సిల్‌కి. పాట ఆగిపోయింది. సభవారి కండ్లకి తండ్రికాళ్ళదగ్గర పడియున్న జీవం లేని అమరసంగీత విద్వాంసుడు మన్సిల్ కనబడ్డాడు.



గంతకు తగిన బొంత

పూర్వము ఒక ముని వరుడు వుండే వాడు. ఆయన ఒక ఎలుకను చూచి తన మంత్ర శక్తితో సౌందర్యవతిగా మార్చాడు. నాడు మొదలుకొని కన్న కూతురుకన్న గారాబముగా పెంచేవాడు. యుక్తవయస్సు వచ్చినది. ఆమె చక్కదనాన్ని చూసి ఎంతో మురిసేవాడు. నాచిట్టికి ఎక్కడ్నైనా మంచి వరుని తీసుకొచ్చి పెండ్లి చేయవలె నని, ఒక నాడు ప్రయాణమైపోయి ముల్లోకములుగాలించి తుదకు రవికంటెను మించిన వాడులేడని సూర్యునిదగ్గరకు వెళ్లి "రవిగారూ నా ముద్దుల పట్టిని మీరు చేపట్టవలె" నని అడిగాడు. అందుకు రవి "నాకంటె మబ్బుగొప్ప, నాదేముంది, వట్టిచాకిరీ తప్ప, మబ్బుకివ్వండి" అన్నాడు. మునివరుడు నేరుగా వెళ్లి మబ్బు నడిగాడు. మబ్బన్నదిగదా! "ఏమయ్యా! నా గొప్పను గూర్చి మీకు చెప్పినవారు ఎవరు? గాలివిసిరిందంటే ఎంతో దూరము పోయి పడతాను, నాకంటె గాలి గొప్ప కాబట్టి వాయుదేవుని కివ్వండి తమ పట్టిని." ముని వాయుదేవుణ్ణి అడిగాడు. ఆయనన్నాడు "మునివరా నాకంటె గోడ గొప్ప, గోడ అడ్డమొస్తే మరి నాకెక్కడ త్రోవ చెప్పండి" ముని, కిక్కురుమన కుండా వెళ్లి గోడనడిగాడు. గోడన్నది "నేను ఎలుకకు లోకువ ఎలుక కివ్వండి" ముని ఆలోచించి యిదే మంచి దని చక్కని ఎలుకను తోడితెచ్చి, రెంటిని జతపరిచి గంతకు తగిన బొంత, అని ఎంతో సంతసించాడు.

మిస్. కె. పద్మ

చిత్ర సమీక్ష

ఈస్టిండియావారి "సంక్రాంతి" చిత్రం సెప్టెంబరు 22.వ తేదిన మినర్వాటాకీసులో పత్రికా ప్రతినిధులకు ప్రదర్శించబడింది.

ఈ చిత్రానికి శ్రీ చి. పుల్లయ్యగారి దర్శకత్వము ప్రత్యేకతను సమకూర్చింది. ఇది గృహలక్ష్ములను ఎంతైనా ఆకర్షిస్తుంది. కథలో పెద్దకోడలి అహంభావంచేత పండువంటి సంసారం ఎలా నాశనమయిందీ, దాని ఫలితంగా ఆమె కడపట ఎలాగ కష్టాలపాలయేది చిత్రించబడింది. శివరావు ఆంగ్లో ఇండియన్ నృత్యము వెగటుగా కనిపించింది. శాంతకుమారి, శ్రీరంజని, సావిత్రి బాగా నటించారు.

ఈ చిత్రంలో సెట్టింగ్స్, ఫొటోగ్రఫీ బాగున్నవి. సంగీతము మనోజ్ఞంగానున్నది.

ఈ చిత్రానికి 'సంక్రాంతి' పేరుకంటె మరేదైనా తగిన పేరుంటే బాగుండేదేమో! మొత్తముమీద చిత్రం ఆకర్షణవంతంగా నున్నది.

'మెస్నన్'

లోకవార్తలు

నిజాం కమ్యూనిస్టులు తమవద్దనున్న ఆయుధాలను బేషరతుగా ప్రభుత్వానికి అప్పగిస్తామని అంగీకరించినట్లు హైదరాబాద్ ముఖ్యమంత్రి వెల్లడించాడు.

◆ ◆ ◆

రాయలసీమ యందలి క్షామప్రాంతాలలో ప్రధానమంత్రి నెహ్రూ పర్యటించి అక్టోబరు 8.వ తేదిన మద్రాసును వచ్చారు.

◆ ◆ ◆

ఇండియానాలో చార్లెస్ ఫెదర్ స్టోన్, పనియా ఫెగ్లీ వివాహం చేసికొన్నారు. వరుని వయస్సు 90 ఏండ్లు. వధువు వయస్సు 70 ఏండ్లు, వీళ్లిద్దరు తమకింకా అనుభవించవలసిన సంవత్సరాలు చాల ఉన్నవనియు, సుఖప్రదమైన భవిష్యత్తు ముందున్నదని చెప్పారుట.

◆ ◆ ◆

తనభర్త ఆలీఖాన్ ఎల్లప్పుడు ఆటలతోటి,జూదం, గుర్రపుపందెములతోటి జీవితం గడుపుతూ కుటుంబ జీవితానినే నిర్లక్ష్యం చేస్తుండటం వలన అతని భార్య ప్రఖ్యాత హాలీవుడ్ సినిమానటి రీటాహేవర్త్ విడాకులివ్వ నిశ్చయించుకొన్నదిట.

◆ ◆ ◆

క్షామపీడనుండి రాయలసీమకు శాశ్వతవిముక్తి సాధనకు యిప్పటినుండి పునాదులు వేయాలనియు, ప్రజలసహకారం లేనిదే ప్రభుత్వము ఏమిచేయజాలదని అనంతపురంలో ప్రధాని నెహ్రూ హెచ్చరించారు.

◆ ◆ ◆

దేశంలో గోవధ నిషేధంకోసరం రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘమువారు సత్యాగ్రహము చేయనున్నారని శ్రీగోల్వాల్కర్ ప్రకటించారు.

◆ ◆ ◆

బొంబాయిలో ప్రభుత్వము విధించిన క్రొత్త పన్నులయెడల అసమ్మతి చూపుటకు తమ లెటర్ హెడ్సుమీద "ప్రజాస్వామ్యం బొంబాయిలో లేదు" అని ముద్రించుట క్రొత్త పద్ధతిగా బొంబాయి వర్తకులు నిర్ణయించుకున్నారు.

◆ ◆ ◆

ప్రజాసోషలిస్టుపార్టీ కార్యకర్తలు విధాయకంగా ఖద్దరుకట్టాలని శ్రీజయప్రకాష్ నారాయణ్, ఆచార్యకృపలాని అభిప్రాయం. త్వరలోనే ఇది అమలులోనికి వస్తుందట.

◆ ◆ ◆

కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యులుగా నూతనంగా ఎన్నుకోబడిన నలుగురు సభ్యులలో శ్రీమతి పుష్పబెన్ మెహతా ఒకరు.

◆ ◆ ◆

ప్రజాసోషలిస్టుపార్టీ నాయకుడు శ్రీ ప్రకాశం పంతులుగారు విజయవాడలో ప్రసంగిస్తూ ఆంధ్ర రాష్ట్ర సాధనకు స్వామీ సీతారాంగారి ఉద్యమం మార్గం కాదన్నారు.

◆ ◆ ◆

ఖోస్లా కమిటీ నివేదికను మద్రాసు ప్రభుత్వము నిరాకరిస్తూ కృష్ణా-పెన్నార్ ప్రాజక్టును విడిచిపుచ్చజాలమని సమాధానం పంపింది.

దేశం మొత్తంమీద 6 రాష్ట్రాలలో ఆహారదుస్థితట. 2 కోట్లమంది క్షామపీడితులని అంచానా.

♦ ♦ ♦

సంఘ శ్రేయస్సు కొరకే పరమాణుశక్తి విని యోగించబడాలని, యుద్ధాలలో అటంబాంబులను, హైడ్రోజన్ బాంబుల నుపయోగించటమంటె మానవ నాగరికత పూర్తిగా విధ్వంసమై పోవడ మేనని ప్రధాని నెహ్రూ అభిభాషణ.

♦ ♦ ♦

ప్రసిద్ధ తెలుగు రచయిత్రి, సంఘ సేవకురాలు అయిన శ్రీమతి కనుపర్తి వరలక్ష్మమ్మగారి 67 వ జన్మదినోత్సవం బాపట్లలో స్త్రీసమాజం వారిచే జరుపబడింది.

ఆస్థానకవి శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రిగారు సభకు అధ్యక్షత వహించారు.

శ్రీమతి వరలక్ష్మమ్మగారి జీవిత విశేషాలను గురించి, ఆమె కవిత్వ మాధుర్యమును గురించి ముచ్చటించి, స్త్రీలు ఎంతవరకు విద్యనభ్యసించ వలెనో అధ్యక్షులు తెలిపారు.

శ్రీమతి గుడిపూడి ఇందుమతీదేవి, శ్రీ అనుభవానందస్వామి, స్వామీ శివశంకరులు, శింగరాజు నాగభూషణరావు మొదలైనవారు శ్రీమతి వరలక్ష్మమ్మగారిని ప్రశంశించారు.

ఆహ్వాన సంఘమువారు శ్రీమతి వరలక్ష్మమ్మగారికి చీర, రవిక, శాలువ, వెండికంచం, గ్లాసు, ఫౌన్ టెన్ కలములను బహూకరించారు. శ్రీకృష్ణమూర్తిశాస్త్రి, ఇందుమతీదేవిగార్లకు ఉడుపులు బహూకరించ బడెను.

♦ ♦ ♦

సెప్టెంబరు 17 వ తేదీన కన్నాపురం వాస్తవ్యురాలు శ్రీమతి కానుమిల్లి వెంకటనరసమ్మగారు వారి తల్లిగారైన కీ. శే. సుభద్రమ్మగారి పేర రూరల్ డిస్పెన్సరీకిగాను ఉచితముగా నిచ్చిన భవనమును మద్రాసు మంత్రి శ్రీ బులుసు పట్టాభిరామారావుగారు తెరచారు. ఈ సందర్భంలో అనేకమంది కోయలకు అన్నదానం జరిగింది. మంత్రిగారు డిస్పెన్సరీ భవనమును తెరచుచు శ్రీమతి వెంకట నరసమ్మగారు ఆంధ్ర విశ్వవిద్యాలయమునకు, మద్రాసులో కేసరి విద్యాలయమునకు, కొయ్యలగూడెంలో వైద్యశాలకు వేలకొలది రూపాయల విరాళమిచ్చినందుకు అభినందించారు.

♦ ♦ ♦

క్షామపీడితులకు సోవియట్ రష్యా పంపిన విరాళములు యూనియన్ మంత్రి అమృత్ కౌర్ కు అప్పగించబడెను.

♦ ♦ ♦

మైలాపూరులో 'స్త్రీ సదన్' వార్షికోత్సవ సందర్భమున మంత్రి సుబ్రహ్మణ్యంగారు స్త్రీ సదన్, విజిలెన్స్ హోమ్‌ల కృషిని ప్రశంసించారు.

♦ ♦ ♦

మిల్లు ధోవతులు, చీరల ధరలపై కంట్రోలు రద్దుచేస్తూ వాటిని 100 కి 40 వంతులు నిష్పత్తిలో విధిగా ఉత్పత్తి చేయాలనే నిబంధన తొలగిస్తూ ప్రకటించబడింది.

♦ ♦ ♦

దక్షిణాఫ్రికా భారతీయ సమస్యా పరిష్కారానికి మధ్యవర్తి నియామకమునకు ఇండియా, పాకీస్థాన్‌లు సమ్మతించినవి.

♦ ♦ ♦

హైదరాబాద్ చేనేత పారిశ్రామిక సంఘానికి 13 లక్షల రూపాయలను ఋణంగా నివ్వడానికి ప్రభుత్వము నిర్ణయించింది.

♦ ♦ ♦

యువజనులు వివాహితులై నిర్దుష్టమైన దాంపత్య జీవితం గడుపుతూ తమ గృహాలను ఆనందదాయకములుగా మార్చుకోడానికి సహాయభూతం కాగలదే గార్హ్యశాస్త్రమని మద్రాసు ముఖ్యమంత్రి శ్రీ సి. రాజగోపాలాచారిగారు గార్హ్యశాస్త్రవేత్తల సమావేశంలో వక్కాణించారు.

---o---

స్త్రీల ఉద్యోగములు — కుటుంబశాంతికి భంగకరములు

ఆలిండియా రేడియో, విజయవాడ

లక్ష్మీకాంతమ్మగారు:- ఏమండీ పద్మావతమ్మగారూ అప్పుడే వచ్చారే మీరు స్కూల్లో పని పూర్తి చేసుకోవడమూ, మళ్లీ సంగీత సభకు తయారై రావడమూకూడా జరిగిపోయింది. ఎట్లా సమర్థిస్తున్నారండీ! అటు ఉద్యోగము ఇవి కాక పైగా సభలూ, సమావేశాలూ ఎట్లాగైనా అదృష్టవంతులండీ. కుటుంబశాంతికి భంగంరాకుండా సంసారంలో అన్నీ సవరించుకొని ఎట్లాగో తెలిపిచేసుకొని ఎప్పుడో ఒకప్పుడు సభా సమావేశాలకు హాజరు కావడానికి మాకు తలప్రాణం తోకకు వస్తూంది.

పద్మావతమ్మగారు:- ఏమండీ లక్ష్మీకాంతమ్మగారు అంత చిత్రంగా మాట్లాడుతారు మరీను. మీరు మాత్రం ఏం తక్కువ చేస్తున్నారండీ ఊళ్ళోయే సభలకు, ఏ సమావేశాలకు మీరు హాజరు గాకుండ ఉన్నారు. అట్లని మీరు మాత్రం కుటుంబం దిద్దుకోడం మానేసారా.

ల:- ఆఁ, ఎట్లా మానివేస్తాంలెండి కాని ఎట్లాగైనా పైపనులు అంటే, బహిర్వ్యాపకాలున్న స్త్రీకి కుటుంబ నిర్వహణంలో అశాంతి తప్పదు. చూడండి నాపని ఇంతవఱకూ తెమలనేలేదు. ఈ పనులన్నీ వదిలేసి నామట్టుకు నేను పోయానంటే వచ్చేటప్పటికి ఇంట్లో గాలివాన చెలరేగిందన్నమాటే. సంగీత సభ ఆరుగంటలక్కదా అట్లా కూర్చోండి. ఇంతలో పిచ్చాపాటీ మాట్లాడుకొంటూ ఈ పని ముగించి నేనూ వస్తాను.

ప:- పిచ్చాపాటీ ఎందుకు ఈ విషయంమీదనే మాట్లాడుకుందాం. ఇది ఎవరికైనా కావలసిందేగా. అయితే మీ ఉద్దేశం ఉద్యోగాలుచేసే స్త్రీలవలన కుటుంబశాంతికి భంగము కల్గుతుందని గదూ. అంతేనా..

ల:- ఔనండీ ఔను ఉద్యోగానికీ కుటుంబానికీ లంకె ఎట్లా కుదురుతుంది? మనది భారతదేశం. మన భారతీయ గృహాల్లో అతిథీ అభ్యాగతీ గొడ్డూ గోదా అత్తా మామా, నౌకర్లూ చాకర్లూ అన్నీ గృహిణియే చూచుకోవలసి ఉన్నప్పుడు ఇంటికైన ఆడది పనులు చేసుకోడానికి ముఖ్యమైన పగటివేళ ఉద్యోగం అంటూ ఇల్లు వదలిపెట్టి వెళ్తే కుటుంబంలో శాంతి భగ్నంఅయి ఊరుకోదూ?

ప:- అన్ని విషయాలు బాగా చెప్పేరుకాని ఒకటి మాత్రం మరచిపోయినారు మీరు. అతిథి అభ్యాగతుల సత్కారానికి పేరుమోసినది భారతదేశమయినా ఇది మాత్రం పురాణకాలంగాదని నవీన నాగరికత ప్రవాహమువలె ముందుకు తోసుకొని పోవుచున్న సంస్కరణకాలం యిది అని ఇప్పటి మన సంసారాల అవసరాలు, ఆర్థికదుస్థితి, ప్రభుత్వ సౌకర్యాలు అన్నిటిని మించిన వస్తువుల రేషనింగు పద్ధతులు ప్రతివాళ్లు గమనించే ఒక్కొక్క ఇళ్ళకు అతిథులుగా వెళ్లుచున్నాముగాని పూర్వమువలె అనవసరముగ బంధువుల ఇళ్ళకు వెళ్లి కూర్చోవడంలేదుగదా. సమర్థులైన స్త్రీలు కుటుంబాలు దిద్దుకుంటూ ఉద్యోగాలు చెయ్యడం అంత చిక్కుండదు సుమా.

ల:- ఈ నాగరకతా కాలంలో ఆధునిక సౌకర్యాలతో అన్నీ దిద్దుకోవచ్చునంటారే మీరు? ఇంటిపనికి ఒకవేళా పాళా అంటూ లేదుకదా. ఎంత చేసినా వాటికి అంతూ పొంతూ ఉండదు. ఇపుడంతా ఒంటరికాపురాలవాళ్లుకదా, ఉద్యోగంమీద ఆడది వెళ్ళిపోయినపుడు ఇంటికెవరైనా చుట్టాలువస్తే అపుడెట్లా చెప్పండి? వెనకటి కాకమాలు ఇట్లాగే నేను ఉద్యోగంలోఉన్న

ఒక స్నేహితురాలింటికి వేళగాని వేళలో వెళ్ళి తిండీగిండీ అమరక నానా అవస్థలూ పడ్డాను.

ప:- అయితే ఏమండీ ఉద్యోగంమీద కాకపోతే మట్టుకు, ఇల్లు మెడకు కట్టుకొని కూపస్థమండూకాలవలె అస్తమానం కూర్చుంటారండీ ఎప్పుడూ! ఏదైనా పనిమీదగాని, ఏదైనా యిబ్బందులొచ్చినప్పుడుగాని, ఎలా సర్దుకుంటామో అలాగే యిప్పుడూ సర్దుకోకూడదా. కావాలంటే ఒక పూటకూ అరపూటకూ హోటల్లు లేకపోయినాయా?

ల:- ఆఁ, హోటళ్ళ సౌభాగ్యం చెప్పారు! మన దేశంలో హోటళ్ళ సంగతి మనం ఎఱుగనిదా! పిల్లలతో బయలుదేరే కుటుంబాలకు హోటళ్ళేం సౌకర్యంగా ఉంటాయండీ అంతేకాక ఎప్పుడైనా ఏదైనా ఇబ్బందిమీద ఇంట్లో లేకుండా వెళ్ళేదీనూ, నిత్యమూ ఒకవేళపట్టున నియతంగా ఉద్యోగానికి వెళ్ళడమూ ఒకటేనా? ఎవరైనా ఇంటికి వచ్చారంటే ఉద్యోగం విడిచిరావడానికి అధికారులు ఒప్పుతారా? ఔను కానీ బియ్యమూ పప్పూ ఉప్పూ బాగుచేయించుకోవడమూ అవీ ఈ ఉద్యోగంవలన అడ్డేకదా?

ముఖ్యంగా సంసారులకు ప్రథమ కర్తవ్యమూ, ముఖ్య కర్తవ్యమూ ఐనది బిడ్డల పెంపకంకదా. బిడ్డలుకలవాళ్లు ఇంటిపట్టునున్నా కాని బిడ్డల పెంపకం సమస్యలు తీర్చలేక సతమతమౌతూ ఉంటారు. ఇక ఉద్యోగస్థులైన గృహిణుల పిల్లల అగచాట్లు చెప్పడానికి వీలేలేదు. తల్లులు వచ్చేవఱకూ ఇరుగు పొరుగులపడి పంచల్లో నౌకర్ల ఆధారంతో దయనీయ పరిస్థితుల్లోపడి పొర్లాడేవాళ్ళెంతమందో మనం చూస్తూ ఉన్నాము.

ప:- శని ఆదివారాలు సెలవుదినాలు ఏంచేస్తారండి పప్పులూ బియ్యాలు బాగుచేసుకోడానికి యిన్ని రోజులు కావాలేమిటి. ఇంట్లో పనులన్నీ సకాలములోనే పూర్తిచేసుకొని ఉద్యోగాలు చేయగల్గుతారు. తల్లులెప్పుడూ పిల్లల నంటిపెట్టుకొని ఉంటేనే ఎక్కువ గారాబంఅయి పాడై పోతారు. కొంచెం ఎడం ఉండడమే మంచిది. చాలామంది యిప్పుడు చెయ్యడం లేదంటారా సంసారాలు దిద్దుకోడం, బిడ్డలను సవరించుకోడం, వేళపట్టున ఉద్యోగాల కెళ్ళడం, మనదేశాల్లోనే కాక అసలు పాశ్చాత్య దేశాల్లో చూడండీ మనం ఇంత ఆధునిక యుగంలోని యువతులమైనందుకు చూచైనా నేర్చుకోవాలిగదా.

ల:- మహాబాగా చెప్పారమ్మా! చివఱకు పాశ్చాత్య దేశాలకూ మనకూ పోలికా? మొదట్లోనే చెప్పానుగా మనది భారతదేశమని. అక్కడ స్త్రీలు ఉద్యోగాలకువెళ్తే స్టేట్ గవర్నమెంటు వారి పిల్లల సంరక్షణ బాధ్యత, చదువు సాముల బాధ్యతా అన్నీ చూచుకొంటుంది. మనకేవండీ ఆ సౌకర్యాలు? అంతేకాక ఇంటిపనుల సవరింపులోకూడా అక్కడున్న సైన్సు విజ్ఞానాభివృద్ధి ద్వారా మనం ఒక రోజంతా తంటాలుపడే పని వాళ్లు ఒక్క క్షణంలో విద్యుచ్ఛక్తి సహాయంతో ముగిస్తారు. మనం అట్లా చేసుకోగలమామరి. అటువంటి దేశాల్లోనే గృహిణులు ఉద్యోగాలకు పనికిరారు అని లెనిన్, హిట్లరు నిషేధించారు.

ప:- ఎవరో ఒక రష్యానియంత, జర్మనీ నియంత నిషేధించారు అంటే ఎలా? ఆచరణలో ప్రతిదేశంలో ఆడవాళ్ళను చూస్తూనే ఉన్నాముగదా - ఆడవాళ్లు ఉద్యోగాలు చేయడం మన పురాణాల్లో మాత్రం లేదూ? చరిత్రలలో చెప్పబడిన రాజ్యాలు ఏలిన స్త్రీలంత గృహిణులు గారా? ఉద్యోగాలు చేయడం మన హైందవ ఆచారం ప్రకారం క్రొత్తదిగాదు. కాని మనం పోగొట్టుకొనిన ఆచారాలను పునరుద్ధరించుకోవాలి. అయినా మనకు ఏకాలపు సంగతులో, ఏదేశపు సంగతులో ఎందుకు? ఆధునిక కాలంలో మన ఆచరణలో ఉండే కష్టసుఖాలను విచారించి నిర్ణయించుకుందాం. లేని సౌకర్యాలు కావాలని మనం ప్రభుత్వంలో ఆందోళన లేవదీయాలి, మన

మహిళా సంఘాలు, మహిళోద్యమాలు అన్నీ ఏంచేస్తున్నట్టు? మన సంఘాల ద్వారా మనం ప్రభుత్వంలో అవసరమైన ఇలాంటి సౌకర్యాలన్నీ సంపాదించుకోలేక పైపెచ్చు సమర్థురాలైన స్త్రీలు ఉద్యోగాలు చేయుటకు వీలులేదని మీబోటి విద్యావతే ఇలాగంటే ఆర్థిక పరిస్థితుల విషయం ఆలోచించే వారెవరు? ఈ దుస్థితిలో ఇలాగే మగ్గిపోవలసిందనేనా మీ ఉద్దేశ్యం.

ల:- కాదమ్మా నా అభిప్రాయం అది ఎంతమాత్రం కాదు. ఆర్థిక దుస్థితి పోగొట్టడానికి సాధ్యమైనంతవరకూ స్త్రీ పురుషునకు తోడ్పాటు చేయవలసిందే. కాని సంసారానికి ఒకరో ఇద్దరో మగవాళ్లు సంపాదిస్తూంటే ఆడది ఇంటి వఱకూ ఉన్న పనులు సంబాళించి హెచ్చు నౌకర్ల అవసరం లేకుండాచేస్తే అది మాత్రం ఆర్థికస్థితికి సహాయంకాదా? స్త్రీకూడా ఉద్యోగానికి వెళ్లి ఇల్లు నౌకర్లమీద వదలిపెడ్తే ఒక విధంగా చిక్కులా? వాళ్ల జీతాలు, వాళ్లుచేసే దూబరా, అంతేకాక వాళ్లు ఇంట్లోవి తరలించుకొనిపోవడమూ ఒకటా? ఇవన్నీ ఆర్థికస్థితికి సహాయంకాదు సరికదా పైపెచ్చు దుస్థితిని పెంచడానికే హెచ్చుసహాయ పడతాయేమో ఆలోచించండి?

ప:- ఆడదాని ఉద్యోగవిషయంలో ఇన్ని అవస్థలున్నట్లు మీరెలా ఊహిస్తున్నారో నాకర్థం గావడంలేదు. స్త్రీకి స్వాతంత్ర్యం, సమాన హక్కులు ఉండాలని మనమేగాక మగవారు గూడ అంగీకరించారుగా. స్త్రీ చదువుకొని, విజ్ఞానవంతురాలయి పురుషునితో సమానమైన తెలివితేటలు, మేధాశక్తి గలదై ఉద్యోగం చేసి సంపాదనలోగూడ తనకు చేతోడు వాదోడుగా ఉండగల సమర్థురాలయినపుడు మొగవాడు ఇంట్లో కొంచెము ఆడదానికి ఎందుకు సహాయపడగూడదు? ఇద్దరూ ప్రొద్దున్నే లేచి ఇంటిపనులలో ఒకరికొకరు తోడ్పడుతూ చేసుకుంటే నౌకరుల అనవసర ఆర్భాటాలకు, దొంగతనాలకు సందెక్కడ ఉంటుంది? హెచ్చుడబ్బు సంపాదన ఉన్నప్పుడు పిల్లలను ఇంకా హెచ్చు సౌకర్యాలతో పెంచుకోవచ్చుగదా? మితిమీరిన జనభా పెరిగి ఒక్క మగవాడి సంపాదన చాలక చాలా దారిద్ర్యంతో అటమటించే సామాన్య సంసారాలు మనం చూడ్డంలేదండీ -

ల:- నిజమే ఈ కాలపు ఆర్థిక దుస్థితి తీర్చడానికి మగవానికి సహాయపడవలసిందే. స్త్రీకి సమాన హక్కులూ స్వాతంత్ర్యమూ కావాలనీ పురుషునితోబాటు ఉద్యోగాలు నిర్వహించవలెనని ఎందరెన్ని వేదికలెక్కి ఉపన్యాసాలిచ్చినా ఆచరణలోకి వచ్చేటప్పటికి ఆసిద్ధాంతమంతా తలక్రిందులై స్త్రీని అనేక కష్టనష్టాలకుగురిచేస్తూ ఉంది. అసలే ఆరోగ్యంలేక ఒంటి ఊపిరితో ఉండే నేటి స్త్రీ ఉద్యోగమూ, ఇంటిపని పిల్లలపనీ చేసి, విరామంలేకపోవడంచేత మరీ అనారోగ్యం పాలౌతూ ఉంది. దానివలన డాక్టర్ల బిల్లొకటి హెచ్చు.

అంతేకాక స్త్రీ ఆర్జనకు అమోదం చూపినా ప్రతీ మగవాడూ మీరనుకొన్నట్లు ఆడదానికి ఇంటిపనుల్లో తోడ్పడతాడని చెప్పలేము. అట్టి పరిస్థితేవస్తే స్త్రీని ఉద్యోగమూ వద్దు సద్యోగమూ వద్దని నిరోధిస్తారుకూడా. దానివలన ఉద్యోగానికి అలవాటుపడిన స్త్రీవలన లేనిపోనిది ఆలు మగల మధ్య మనో వైకల్యాలు ఏర్పడ్డంకూడా కద్దు.

ఏమైనా ఇంట్లో వెనకాల పనీ పాటా చూచేందుకు నా అనేవాళ్లు ఎవరైనా ఉంటే తప్ప ఆడది ఉద్యోగం చేయలేదు. కాని అల్లాంటిచోట ఉద్యోగం కుటుంబశాంతికి భంగకరమా? అన్న ప్రశ్నే లేదు. చూడగా మీరా ఉద్దేశంతోనే మాట్లాడుతూన్నట్లున్నారే.

ప:- ఎలాగైనా ఆర్థికదుస్థితి విషయం వచ్చినప్పుడు మీరుగూడ స్త్రీలు ఉద్యోగాలు చెయ్యాలని ఒప్పుకున్నారుగాదా. ఒక ప్రధాన దేశసమస్యను పరిష్కరించడం కోసరం కుటుంబ నిర్వహణానికి ఇబ్బందిగలగడం లాంటి చిన్న చిన్న విషయాలను పట్టుకొని మనం ఇంకా పోట్లాడితే ఎలా, ఇంట్లో వేరే ఆడవాళ్లు హంగే చూసుకుంటారో. స్టేటు గవర్నమెంట్ చేత సౌకర్యాలే చేయించుకుంటారో అదంతా వేరు విషయం. పురుషునితో సమానమైన విచక్షణాశక్తిగల స్త్రీలు తమశక్తిని ఉపయోగింపక ఇళ్లలో పడియుండుటవలన దేశ ఉన్నతికి హేతువుగాక దేశపతనానికే హేతువయ్యేమాట ముమ్మాటికి నిజం అవుతుంది. ఇప్పటి పరిస్థితులలో స్త్రీలు తప్పక ఉద్యోగాలు చెయ్యాలి. అందువలన వారి కుటుంబాలలో ఏలాంటి చిక్కులూ ఉండవని నా ఉద్దేశం. ఉన్నా సహించుకోవాలంటాను.


ల:- స్త్రీ ఉద్యోగం చేసి ఆర్థిక క్లిష్ట పరిస్థితిని పరిష్కరించి దేశసౌభాగ్యానికి తోడ్పడాలనే సిద్ధాంతంతో ఏకీభవించడానికి నాకూ ఏమీ విప్రతిపత్తిలేదు. కాని ఉద్యోగినియైన స్త్రీవలన కుటుంబంలో అశాంతి ఏర్పడుతుందని మీరూ ఒక విధంగా అంగీకరించనే అంగీకరించారు కదా. చిక్కులు సహించాలనే మీ వాదంతో నేను సహకరింపలేను. కుటుంబశాంతి ఉద్యోగ నిర్వహణమూ అనేవి ఉత్తర దక్షిణ ధ్రువాలు. వీటి రెంటికీ పొంతనా కుదరదన్నమాట తథ్యం.

మనయిద్దరకు రాజీ అయింది. పదండి సంగీత సభకు వేళైనది పోదాము.



రాజరాజేశ్వరివారి 'పెద్దరైతు' లో కుమారి తులసి





యుక్తిమాల: శ్రీమతి స్థానాపతిరుక్మిణమ్మగారు. ప్రతులు లభించుచోటు కవితా సమితి, విశాఖపట్టణం వెల రు 1-4 0

ఇందులోని చిన్నకథలు చాలభాగం పురాణేతిహాసములలోనివియు, చరిత్రాధారము గలవియు, నీతిబోధకములుగా నున్నవి.

ఈగ్రంధములోని కథలు విజ్ఞాన వికాసాలకు ఉద్దేశించబడినవి. తన ప్రయత్నంలో కవయిత్రి రుక్మిణమ్మగారు కృతకృత్యులైనారని చెప్పవచ్చును.

భాషాశైలి మృదుమధురంగా నున్నది. బాల బాలికలకు పఠనీయంగా ఎంతైనా ఉపకరిస్తుందన డానికి సందేహములేదు. విద్యాలయములు పాఠ్యగ్రంధముగా గుర్తించగలవని మావిశ్వాసం.

నాతమ్ముడు: అనువాదం: శ్రీ బి. విశ్వేశ్వరరావుగారు, బాబు ఆఫీసు, మద్రాసు 6 వెల రెండు అణాలు.

పసిపిల్లలకని ప్రచురించబడే పుస్తకాలలోనిది యొకటి. కాని వారి ఉద్దేశం మంచిదైనా ప్రాథమిక విద్యార్థులు చదివి ఆనందించగల పద్ధతిలో అచ్చుకాలేదు. పుస్తకంలో బొమ్మలతోబాటు అక్షరాలు సయితం కొంచము పెద్దవిగా నున్నట్లయితే ఉత్సాహాతిశయాలను ప్రేరేపించేదిగా నుండేది. ఇందలి కథావస్తువు మాత్రం చాల సరళంగాను, సహజంగా నడచింది. పుస్తకం ఆకర్షనీయంగా నున్నది.

సుహేళీ: శ్రీ బాపు, ప్రతులు దొరుకుచోటు సుహేళీ ప్రచురణలు, మైలాపూరు, మద్రాసు 4. వెల 6 అణాలు.

ఇదిబొమ్మలకథ పుస్తకం. ఇందులోని బొమ్మలు, వానిననుసరించిన కథ ఉత్సాహవంతంగాను, రసవంతంగానున్నది. కాని బొమ్మలక్రింది అక్షరాలుయింకా పెద్దవిగానుండియుంటే యింకా బాగుండేది.

ప్రాథమిక విద్యార్థుల విద్యాభిరుచికి, అభివృద్ధికి బాబూ ప్రచురణలు, సుహేళీ ప్రచురణలు విశేషంగా నుపకరిస్తవి.

'మాతృసేవ' దసరాసంచిక మా కార్యాలయము చేరినది. చక్రపాణి ముఖ చిత్రంతో ఆకర్షవంతంగా నున్నది.

ఇందు అనేక అమూల్యమైన వ్యాసాలు, వ్యంగ్య చిత్రాలున్నవి. అనేక ప్రస్తుత సమస్యలను గురించిన వ్యాసములున్నవి.

ఈపత్రిక సంపాదకులు శ్రీధర్ గారు తమ పత్రికను సమగ్రముగా ఉత్తమ లక్ష్యాలతోటి, ఆదర్శాల తోటి, రాజకీయ, సాంఘిక, వైజ్ఞానికాభివృద్ధులకు తోడ్పడునట్లు కృషిచేయుచుండుట అభినందనీయము.

ప్రతి వెల 0-6-0. దొరకుచోటు 25 ఎ. తంబుచెట్టి స్ట్రీటు, మద్రాసు.

సంపాదకీయములు

అభినందనలు

మద్రాసు మంత్రులు శ్రీపట్టాభి రామారావు డాక్టరు యం. వి. కృష్ణారావుగారల రాజీనామా ఫలితంగా ఆంధ్రవిశ్వవిద్యాలయ సెనేటులో ఏర్పడిన ఖాళీలకు దివాన్ బహదూరు బండి శ్రీహరిరావు నాయుడుగారు, తోలేటి కనకరాజుగారలు యీనేల 6 వ తేదిన జరిగిన ఎన్నికలలో ఎన్నుకోబడిరి.

శ్రీ శ్రీహరిరావునాయుడుగారు ప్రస్తుతము కేసరి విద్యాసంఘ కార్యదర్శి. విద్యావిషయంగా విశేష శ్రద్ధగలవారు. వీరి విశాల హృదయం, పలుకుబడి వారిపై నూతనంగా పడిన బాధ్యత నిర్వహణకు ఎంతైనా ఉపకరించగలవు.

ఈసందర్భంలో హృదయపూర్వకంగా వీరినభినందిస్తున్నాము.

పండిత నెహ్రూ రాయలసీమ పర్యటన

ప్రధానమంత్రి పండితనెహ్రూ క్షామపీడిత రాయలసీమ ప్రాంతాలను పర్యటించి పరిస్థితులను స్వయంగా తెలిసికొన్నారు. ఈపర్యటనవలన కేంద్రమునుండి క్షామపీడిత ప్రజానీకానికి సహాయం లభించనుండుటం హర్షనీయం.

ఈపర్యటన సందర్భంలో పండితనెహ్రూ అనేక ఉపన్యాసాలిచ్చారు. ప్రతి ఉపన్యాసము నిర్మాణాత్మకమైన కృషినే ప్రబోధిస్తున్నది. కాని అవికార్యరూపం దాల్చుటకు ప్రజలకు సరియైన నాయకత్వముకలదా అనేదే సంశయాస్పదం.

మద్రాసులో ఆంధ్రరాష్ట్రాన్ని గురించి పాతపాటపాడి వెళ్లారు. సంపూర్ణమైన ఏకాభిప్రాయం కుదిరితేనే కాని రాష్ట్రనిర్మాణం సాధ్యంకాదనియు, తాను మధ్యవర్తిత్వము వహింపజాలనన్నారు.

రాయలసీమలోని కరువుకాటకాల మధ్యన రాష్ట్రనిర్మాణ సమస్య ప్రధానమయినది కాదన్నారు.

రాయలసీమలోని కరువు కాటకాలు యీనాటివికావు. పండిత నెహ్రూకు క్రొత్తకావచ్చు. ప్రతి ఏట అనేకబాధలు పడుతున్న రాయలసీమకు మద్రాసు రాష్ట్రమందలి ఆంధ్రులు, ఆంధ్రేతరులు సహాయం చేస్తున్నారు. శాశ్వతమైన కరువు నిరాదరణ ప్రయత్నాలను యింతకాలమునుండి రాష్ట్ర, కేంద్రప్రభుత్వాలు చేపట్టక పోవడం ఎవరితప్పంటారు? దీనిని ఒక కారణంగా ఆంధ్రరాష్ట్రనిర్మాణమును వాయిదావేయడం సబబు కాదేమో.

ఏవిషయంలోను సంపూర్ణ ఏకాభిప్రాయం అరుదు. ఈపరిస్థితులలో పండితనెహ్రూ మధ్యవర్తిత్వము ప్రధాన సమస్య లాంటి ఆంధ్రరాష్ట్ర నిర్మాణం ఎందుకు పూర్తిచేయకూడదో మరి?

శ్రీ అడవి బాపిరాజుగారి అస్తమయం

శ్రీబాపిరాజుగారి మరణం చాల విచారకరమయింది. వీరుచిత్రకారులు, రచయిత, కవి - యివి అవి అననేల సకలశాస్త్రములలో ప్రవీణులు.

వీరి రచనలలో ప్రత్యేకత ఎల్లప్పుడు ఉట్టిపడుతుంటుంది. వీరివిశాలభావాలు చదువరులను ఉర్రూతలూపుతుంటవి. వీరి రచనా మాధుర్యాన్ని అనుభవించేవారు వారిని ఎల్లకాలం ఆరాధిస్తారు.

వీరిపాండిత్యాన్ని, ప్రజ్ఞావిశేషాలను ఆంధ్రులెన్నడు మరువరు. ఇట్టిమహనీయునకు శాశ్వత స్మారక చిహ్నము ఏర్పరచుట ఆంధ్రమహాజనుల ధర్మము.


—— x ——

శ్రీ నందననామ సం॥ర ఆశ్వయుజ-కార్తికమాసములు.

	16	గు	త్ర 45.42 పూఫ 1.8 నరకచతుర్దశీస్నానం
	17	శు	చతు 49.17 ఉఫ 6.29 ది 29.10 త్యా 4.19
	18	శ	● అమా 52.0 హ 11.8 దీపావళి అమావాస్య మహాలక్ష్మీపూజా
			కార్తికమాసం
1952 సం॥ అక్టోబరు నెల	19	ఆ	శుద్ధపాడ్యమి 43.40 చి 14.51 త్యా 4.11
	20	సో	ది 54.8 స్వా 17.31 రా 2.44 యమద్వితీయ
	21	మం	త 43.19 విశా 19.0 ది 29.4
	22	బు	చ 51.13 అనూ 19.16 రా 3.59 నాగచతుర్థి
	23	గు	పం 47.55 జ్యే 18.19 రా 8.37
	24	శు	ష 43.32 మూ 16.16 ది 12.23 త్యా 3.52
	25	శ	స 38.17 పూషా 13.14 రా 3.1 త్యా 3.45
	26	ఆ	అ 32.23 ఉషా 9.27 ది 18.45 అమృతయోగం
	27	సో	న 26.5 శ్ర 5.8 ది 14.23 త్యా 3.42
	28	మం	ద 19.39 ధ 0.33 శత 55.22 తిథిద్వయం
	29	బు	ఏ 13 21 పూభా 51.35 ది 10.38 ఉద్ధానైకాదశి
	30	గు	ద్వా 7.23 ఉభా 47.50 ది 13.59 క్షీరాబ్ధి ద్వాదశి
	31	శు	త్ర 2.5 ఏవ్యం 55.15 ది 16.17
1952 సం॥ నవంబరు నెల	1	శ	○ పౌ 43.56 అశ్వ రా 4.28
	2	ఆ	బ. పాడ్యమి 51.44 భ 42.10 ది 6.32
	3	సో	ది 50.45 కృ 42.34 ది 12.17 కేదారవ్రతం
	4	మం	త 51.2 రో 44.10 ది 23.3
	5	బు	చ 52.31 మృ 46.57
	6	గు	పం 55.6 ఆర్ద్ర 50.47 ది 9.11
	7	శు	ష 58.37 పున 55.33 ది 23.5
	8	శ	స 60.10 పుష్య 60.10 ది 17.17
	9	ఆ	స 2.57 పుష్య 0.57 రా 7.59
	10	సో	అ 7.35 ఆశ్రే 6.55 త్యా 4.24
	11	మం	న 12.22 మ 12.55 రా 6.24 త్యా 4.24
	12	బు	ద 17.2 పూఫ 18.47 రా 10.0 త్యా 4.22
	13	గు	ఏ 21.19 ఉఫ 24.17 శూన్యతిథిః
	14	శు	ద్వా 24.56 హ 29.8 రా 22.5
	15	శ	త్ర 27.38 చి 33.7 రా 19.26 శనిత్రయోదశి

Printed and Published by Dr. S. Seshagiri Rao at the Lodhra Press, Kesari Kuteeram L'td. 15, Westcott Road, Royapettah, Madras. Editor : Dr. K. N. Kesari.

ఆంధ్ర దేశమునకు
ఒక సరిక్రొత్త
తెలుగు చిత్రము



కె & కె. ప్రొడక్షన్సు వారి

ఆకలి

తెలుగు

తంగం
ప్రేమ్‌నజీర్
తిక్కురిసి
ద్రౌపది
నటించినది...

డైరెక్టర్... మోహనరావు

RELEASE THROUGH :-

THE VAUHINI PICTURES LIMITED

MADRAS — VIJAYAWADA — GUNTAKAL.